Follow: @ANNTELUGU
ANN తెలుగు
17-08-2026
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 223 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షా కాల సమావేశాలు

### మండలిలో హోరాహోరీ

- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### పిల్లలు మీకు అర్థం కారు థెరపీ తీసుకోండి అంకుల్



- ప్రధాని దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలపై బాలీవుడ్ దర్శకుడి సెటైర్లు

02

### పరకాల నుండి మళ్ళీ రేవూరే



- సీఎం రేవంత్ సంచలన ప్రకటన
- కొండా ఆశలకు గండి

03

### 'టీజీ సేఫ్'.. కల్తీకి చెక్



- ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి

03

# వంద మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం పీకలేరు

### పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



- దమ్ముంటే సెప్టెంబర్ లో అసెంబ్లీకి కేసీఆర్ ను తీసుకురండి
- కార్యకర్తల రక్తాన్ని అమ్ముకున్నారు
- కేటీఆర్ కేటీఆర్ హరీష్ ఎందుకు రక్తదానం చేయరు?
- కష్టాల్లో ఉన్న చెల్లిని కేటీఆర్ ఇంటినుండి బయటకు పంపారు
- అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నారు
- ఓడించేవారే లేరన్న వారిని యశస్విని 50వేల ఓట్లమెజారిటీతో బండకేసికొట్టింది

**వరంగల్, మహా :** అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావాబావ మరిది పదే పదే అడుగుతున్నారు.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్‌ను కూడా సభకు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, రెండున్నరేళ్ల మా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై చర్చిద్దామన్నారు. ఆదివారం పరకాల సభలో మాట్లాడిన సీఎం.. విడతల వారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేని వారు ఇప్పుడు మన పిల్లలను మిగతా 3వ పేజీలో

## సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?



- మేడారం వనదేవతలను దర్శించిన సీఎం
- సమ్మక్కసారలమ్మలకు నిలువెత్తు బంగారం.. పెండింగ్ పనులపై కీలక ఆదేశాలు

**ములుగు, మహా :** మేడారంలో వనదేవతలను బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లాలో సీఎం పర్యటించారు. తొలుత మేడారంలో పర్యటించిన సీఎం.. వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు చేరుకుని గట్టమ్మ దేవాలయం వద్ద హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టరేట్ మిగతా 3వ పేజీలో




# అంతా రింగయ్యారు...!

### సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు..!

- గురుకుల్ ట్రస్ట్–ప్రభుత్వం మధ్య సుప్రీం కోర్టులో వివాదం...!
- ఖానామేట్ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో ప్రభుత్వ భూమి గల్లంతు...!
- కేసు పెండింగ్ లో ఉండగానే బరితెగించిన బిల్డర్లు...!
- నిషేదిత జాబితా 22 (ఏ) లో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు...!
- కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం.. అక్రమార్కులకు గ్రీన్ కార్పెట్..!

రియల్ మాఫియాతో కుమ్మక్కైన అధికారులంతా ప్రజా ధనాన్ని లూటీ చేస్తురన్న ఆరోపణలు స్థానికంగా దుమారం రేపుతోంది.ఖానామేట్ ప్రభుత్వ భూముల పరిరక్షణ వ్యవహారంలో రెవెన్యూ యంత్రాంగం గాలికొదిలేసిసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . అత్యున్నత న్యాయస్థానంలో గత కొన్నేళ్లుగా కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగటం అధికారుల అవినీతి అక్రమాలకు అద్దం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. సుప్రీం కోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా కాలయాపన చేస్తూ సర్కార్ పెద్దలే అక్రమార్కులకు గ్రీన్ కార్పెట్ పరిచారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్లు 11/33, 11/34 లలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు గల్లంతవుతున్నా అటు రెవెన్యూ యంత్రాంగం, అంతస్థుల కొద్ది అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంతో అధికార యంత్రాంగం అక్రమార్కులతో 'రింగ్' అయ్యారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.ఘట్కేసర్ గురుకుల్ ట్రస్ట్-ప్రభుత్వం మధ్య భూ వివాదం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందని స్థానికులు మండి పడుతున్నారు. కేసు పెండింగ్ లో ఉన్నప్పటికీ బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు కొనసాగడం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు దిక్కరించడం కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మిగతా 2వ పేజీలో

## నెలకు రూ.70 వేల ఎస్ఐపి 24 ఏళ్లలో రూ.11 కోట్లు

కాంపౌండింగ్ పై ఫండ్స్ ఇండియా రీసెర్చె రిపోర్ట్

02

## బీసీసీఐలో కీలక మార్పులు

- వీవీఎస్ లక్ష్మణ్‌కు బాధ్యతలు!
- సెప్టెంబరు నుంచి 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' రోల్?
- గంభీర్, అగార్కర్, జట్టు మధ్య సమన్వయానికి కొత్త వ్యవస్థ

07

## సూర్యుడిపై భారీ విస్ఫోటనం




- భూమివైపు దూసుకొస్తున్న సౌర తుఫాను!
- ఆగస్టు 17న భూ అయస్కాంత క్షేత్రాన్ని తాకే అవకాశం
- ముప్పేమీ లేదు.. ధ్రువ ప్రాంతాల్లో 'అరోరా' కనువిందు

02




## విజయవాడలో లంచం బాగోతం

- రూ.15 లక్షలు తీసుకుంటూ రైల్వే ఇంజనీర్ అరెస్ట్
- రూ.179.50 కోట్ల సిగ్నలింగ్ ప్రాజెక్ట్‌లో రూ.7 కోట్ల లంచం డిమాండ్.
- ప్రైవేట్ వ్యక్తితో కలిసి సీబీఐకి చిక్కిన బాపిరాజు

03

# బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం

24 గంటల్లో వాయుగుండంగా మారే ఛాన్స్! ఏపీకి వర్ష ముప్పు.. ఆరు జిల్లాలకు హెచ్చరికలు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన.

02





# అంతా రింగయ్యారు...!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్ ఖానామేట్ సర్వే నంబర్లు 11/33, 11/34కు సంబంధించిన భూ వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేశంలోనే ప్రముఖ ఐటీ కేంద్రంగా గుర్తింపు పొందిన హైటెక్ సిటీకి అత్యంత సమీపంలో, కూకట్‌పల్లి ప్రధాన రహదారికి ఆనుకుని, బుట్టా కన్వెన్షన్ పక్కనే ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కొనసాగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 22(ఏ) నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్లు 11/33, 11/34ల పరిధిలో సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, యథేచ్ఛగా బహుళ అంతస్తుల కమర్షియల్ భవనాలను నిర్మిస్తూ అధికార యంత్రాంగానికే సవాల్ విసిరింది. మరోవైపు ఈ భూములకు సంబంధించి ఘట్కేసర్ గురుకుల్ ట్రస్ట్-ప్రభుత్వం మధ్య న్యాయపరమైన వివాదం కొనసాగుతోందని, భూముల హోదాపై ఇంకా తుది స్పష్టత రావాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వివాదం న్యాయస్థానాల పరిధిలో ఉండగానే భారీ స్థాయిలో కమర్షియల్ నిర్మాణాలు సాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తవగా, ఏడో అంతస్తు పనులు కూడా శరవేగంగా కొనసాగటం విస్మయానికి గురిచేస్తుంది.

**సుప్రీంకోర్టులో కేసు...**
**క్షేత్రస్థాయిలో నిర్మాణాల జోరు..!**

సర్వే నంబర్లు 11/33, 11/34కు సంబంధించిన భూముల అంశం అత్యున్నత న్యాయస్థానం పరిధిలో ఉండగా, అవే భూముల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతుండటం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. భూముల యాజమాన్యం, హక్కులు, హోదాకు సంబంధించి న్యాయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో నిర్మాణ కార్యకలాపాలు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.







స్థానికుల వాదన ప్రకారం, న్యాయస్థానంలో వ్యవహారం పెండింగ్‌లో ఉండగానే సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తవడం, మరిన్ని అంతస్తుల పనులు కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో పరిస్థితి యథాతథంగా ఉండాల్సిన సందర్భాల్లో ఇలాంటి నిర్మాణాలు కొనసాగితే, అది న్యాయస్థాన దృష్టికి తీసుకెళ్లాల్సిన అధికార యంత్రాంగం మీన మేషాలు లెక్కిస్తుందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

**కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం...**
**అక్రమార్కులకు గ్రీన్ కార్పెట్..?**

ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న స్థలానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు సమగ్ర కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కూడా పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పోరాడాల్సిన యంత్రాంగం న్యాయస్థానంలోనే కౌంటర్ దాఖలు చేయక పోవడం వల్ల అక్రమార్కులకు పరోక్షంగా అవకాశం కల్పిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



**సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తులు పూర్తి...**
**ఏడో అంతస్తు శరవేగంగా పనులు..**

స్థానికుల సమాచారం ప్రకారం సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తికాగా, ఏడో అంతస్తు పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణం ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికారులు, ఇప్పుడు భవనం పూర్తి దశకు చేరుకున్న తర్వాత కూడా ప్రభావవంతమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జరుగుతున్న విషయం అందరికీ కనిపిస్తుంటే, సంబంధిత అధికారులకు ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తికి సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందో వెల్లడించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు .

**టౌన్ ప్లానింగ్ చట్టాలు సామాన్యులకేనా..**

జీహెచ్‌ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 461(ఏ) ప్రకారం అక్రమ నిర్మాణాలను గుర్తించడం, నోటీసులు జారీ చేయడం, సీజ్ చేయడం, అవసరమైతే కూల్చివేత చర్యలు చేపట్టే అధికారాలు ఉన్నప్పటికీ ఖానామేట్ వ్యవహారంలో అవి అమలులో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజల విషయంలో కఠినంగా వ్యవహరించే అధికారులు, ఇంత భారీ నిర్మాణాల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.




**అధికారులు–అక్రమార్కులు రింగ్ ..**

ఇంత భారీ స్థాయిలో నిర్మాణాలు నగర నడిబొడ్డున, ప్రధాన రహదారికి ఆనుకుని నెలల తరబడి కొనసాగుతున్నప్పటికీ వాటిని అడ్డుకునే చర్యలు కనిపించక పోవడంతో సంబంధిత శాఖల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ విభాగాల కొందరు అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. వారి కనుసన్నల్లోనే నిర్మాణాలు కొన సాగుతున్నాయని, లేకపోతే నిర్మాణాలు ఈ స్థాయికి చేరుకునేవి కావని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నిద్రపోతున్న నిఘా వ్యవస్థలు..!**

హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో, ప్రధాన రహదారికి ఆనుకుని, వందల కోట్ల రూపాయల విలువైన భూమిలో నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ పర్యవేక్షణ వ్యవస్థలు ఏమి చేస్తున్నాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నెలల తరబడి నిర్మాణాలు కొనసాగినా వాటిని గుర్తించలేదా? గుర్తించినా ఉన్నతాధికారులకు నివేదించలేదా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**హైడ్రా, కలెక్టర్, సీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకుంటారా..**

ఈ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రెవెన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం, హైడ్రా ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భూముల హోదా, నిర్మాణాల చట్టబద్ధత, అనుమతుల ప్రక్రియ, అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.




**ప్రజా వాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు...**
**చెత్త బుట్టకే పరిమితం..!**

ఈ వ్యవహారంపై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినప్పటికీ, సంబంధిత శాఖలకు ఆధారాలు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు కేవలం ఫైళ్లకే పరిమితమయ్యాయా? లేక కావాలనే నిర్లక్ష్యం ప్రదర్శించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎప్పుడు..?**

22(ఏ) నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు ఎలా జరిగాయి? కోర్టు వివాదం కొనసాగుతుండగా పనులు ఎలా ముందుకు వెళ్లాయి? ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా అధికారులు ఎందుకు స్పందించలేదు? ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? అనే ప్రశ్నలకు ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఖానామేట్ భూ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే స్వతంత్ర విచారణే మార్గమని వారు పేర్కొంటున్నారు.













# నెలకు రూ.70 వేల ఎస్ఐపి 24 ఏళ్లలో రూ.11 కోట్లు

- **కాంపౌండింగ్ పై ఫండ్స్ ఇండియా రీసెర్చె రిపోర్ట్**

**మహా :** ప్రతి నెలా క్రమం తప్పకుండా చేసే చిన్న పొదుపు, దీర్ఘకాలంలో ఎంత పెద్ద సంపదను సృష్టిస్తుందో చాలామందికి అవగాహన ఉండదు. క్రమానుగత పెట్టుబడి విధానం (SIP)లో ఉన్న అద్భుతమైన శక్తి 'కాంపౌండింగ్'. దీనినే చక్రవడ్డీ ప్రభావం అని కూడా అంటారు. పెట్టుబడి ప్రయాణం ప్రారంభంలో నెమ్మదిగా కనిపించినా, కాలం గడిచే కొద్దీ సంపద సృష్టిలో దీని వేగం చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఫండ్స్‌ఇండియా రీసెర్చ్ అందించిన ఒక నివేదిక ప్రకారం, ఒక వ్యక్తి నెలకు రూ.70,000 చొప్పున ఒక SIPలో పెట్టుబడి పెడుతూ, దానికి వార్షికంగా సగటున 12 శాతం రాబడి వస్తుందని అనుకుందాం. ఈ లెక్కన అతని పోర్ట్‌ఫోలియో విలువ రూ.11 కోట్లకు చేరడానికి సుమారు 23 సంవత్సరాల 8 నెలల సమయం పడుతుంది. సంపద సృష్టిలో కాంపౌండింగ్ పాత్ర స్పష్టంగా అర్థమవుతుంది. మొదటి రూ.1.1 కోట్లు సమకూరడానికి దాదాపు 8 ఏళ్లు పట్టింది. ఈ మొత్తంలో 60 శాతం పెట్టుబడిదారుడి సొంత డబ్బే కాగా, 40 శాతం మాత్రమే రాబడి ద్వారా వచ్చింది. కానీ, పోర్ట్‌ఫోలియో విలువ రూ.9.9 కోట్ల నుంచి రూ.11 కోట్లకు చేరడానికి (అంటే చివరి రూ.1.1 కోట్లకు) కేవలం 10 నెలల సమయం మాత్రమే పట్టింది. ఈ పెరుగుదలలో 94 శాతం కేవలం రాబడి నుంచే రావడం విశేషం. పెట్టుబడిదారుడి సొంత డబ్బు కేవలం 6 శాతం మాత్రమే. దీనిని నిపుణులు సరదాగా "843 నియమం" అని కూడా పిలుస్తారు. మొదటి రూ.1.1 కోట్లకు 8 ఏళ్లు, తర్వాతి కోటికి 4 ఏళ్లు, ఆ తర్వాతి కోటికి 3 ఏళ్లు పడుతుంది. సుమారు 20 ఏళ్లు దాటిన తర్వాత, అదే ఎస్ ఐపి కొనసాగిస్తే దాదాపు ప్రతి ఏటా ఒక కోటి రూపాయలు పోర్ట్‌ఫోలియోకు జతవుతూ ఉంటుంది

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షా కాల సమావేశాలు

( మొదటి పేజీ తరువాయి )

సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**

అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు. దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించక పోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

# 24 గంటల్లో వాయుగుండంగా మారే ఛాన్స్!

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష ముప్పు పొంచి ఉంది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. ఇది రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

అల్పపీడనం ప్రభావం ప్రధానంగా ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాలపై కనిపించే అవకాశముంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, పోలవరం జిల్లాలకు వర్ష సూచనతో పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**పిడుగులతో వర్షా లు.. అప్రమత్తంగా ఉండాల్సిందే**

అల్పపీడనం బలపడుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉండే ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు. పిడుగులు పడే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు.



**నెల్లూరు, తిరుపతికీ వర్ష సూచన**

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలపైనా అల్పపీడనం ప్రభావం చూపే అవకాశం ఉంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో వాతావరణ పరిస్థితుల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**సముద్రం అలజడి.. మత్స్యకారులకు కీలక హెచ్చరిక**

అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉంది. సముద్రంలో అలలు ఉధృతంగా ఉండటంతో మత్స్యకారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అల్పపీడనం వాయుగుండంగా మారితే సముద్ర పరిస్థితులు మరింత ప్రతికూలంగా మారే అవకాశం ఉండటంతో ఈ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# పిల్లలు మీకు అర్థం కారు

## బాలీవుడ్ దర్శకుడి సెటైర్లు

**మహా :** సోషల్ మీడియా వేదికగా ప్రధాని వ్యాఖ్యలపై ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ స్పందిస్తూ నేటి రాజకీయ భాష యువతరం ఆందోళనలను, వారి ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందా అని ప్రశ్నించారు. "ఈ పెద్దవాళ్లకు ఇప్పటి పిల్లలు అస్సలు అర్థం కారు. 'దిమాగీ నక్సల్' అనగానే ఏదో బ్రహ్మాస్త్రం ప్రయోగించామని అనుకుంటున్నారు. అంకుల్.. ఇప్పటి పిల్లలకు నక్సల్ అంటే ఏంటో కూడా తెలియదు. ముందుగా పుస్తకాల్లోంచి తొలగించిన పాఠ్యాంశాలను మళ్లీ చేర్చండి. కానీ దాని కోసం స్కూళ్లను బాగుచేయాలి, టీచర్లను నియమించాలి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా, నేటి తరాన్ని అర్థం చేసుకోవడానికి పాలకులకు కొన్ని సలహాలు కూడా ఇచ్చారు. "నా సలహా ఏంటంటే.. కాస్త థెరపీ తీసుకోండి. అది చాలా అవసరం. ఆ తర్వాత వాళ్లని ప్రభావితం చేయాలంటే జెన్‌జెడ్ భాష కూడా నేర్చుకోవాలి. దాని కోసం మీరు కూడా చదువుకోవాలి" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ తర్వాత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మరోసారి విమర్శలు గుప్పించారు. ఈసారి ఆన్‌లైన్ ట్రోల్స్‌ను ఉద్దేశించి.. "ఈసారి నా పోస్టుపై వెయ్యి మందికి పైగా ట్రోల్స్ రాలేదు. బహుశా ప్రభుత్వ ఐటీ సెల్ ఆర్థిక పరిస్థితి బాగాలేనట్టుంది. ప్రపంచ బ్యాంకు నుంచి మరికొంత అప్పు తీసుకోవాలేమో" అంటూ సెటైర్ వేశారు.

# సూర్యుడిపై భారీ విస్ఫోటనం

**ఢిల్లీ, మహా :** అంతరిక్షంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సూర్యుడి ఉపరితలంపై సంభవించిన శక్తివంతమైన ప్లాస్మా విస్ఫోటనం కారణంగా భారీగా విడుదలైన విద్యుదావేశిత కణాలు భూమి వైపు దూసుకొస్తున్నాయి. ఆగస్టు 14న సూర్యుడి ఉపరితలంలోని భారీ అయస్కాంత నిర్మాణంలో చోటుచేసుకున్న మార్పుతో కరోనల్ మాస్ ఎజెక్షన్ సంభవించినట్లు అంతరిక్ష వాతావరణ పరిశోధకులు గుర్తించారు. ఈ ప్లాస్మా మేఘం సోమవారం, ఆగస్టు 17న భూమి అయస్కాంత క్షేత్రాన్ని తాకే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.సూర్యుడి నుంచి భారీగా వెలువడిన విద్యుదావేశిత ప్లాస్మా అంతరిక్షంలో వేగంగా ప్రయాణిస్తూ భూమివైపు వస్తోంది. అంతరిక్ష వాతావరణ సంస్థలు దీని కదలికను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. భూమిని నేరుగా తాకినప్పుడు సౌర తుఫానుగా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుత అంచనాల ప్రకారం ఇది G1 స్థాయి సౌర తుఫానుగా ఉండే అవకాశం ఉంది. ఈ స్థాయి తుఫానును తక్కువ తీవ్రత కలిగిన భూ అయస్కాంత తుఫానుగా పరిగణిస్తారు.

**భూమికి ముప్పు లేదు.. కానీ ఆకాశంలో అద్భుతం!**

ఈ సౌర తుఫాను కారణంగా సాధారణ ప్రజల రోజువారీ జీవితానికి ఎలాంటి ప్రత్యక్ష ముప్పు ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భూమి అయస్కాంత క్షేత్రంతో సూర్యుడి నుంచి వచ్చిన అధిక శక్తి కణాలు ఢీకొన్నప్పుడు ధ్రువ ప్రాంతాల్లో అద్భుతమైన కాంతి దృశ్యాలు ఏర్పడే అవకాశం ఉంది.

ఉత్తర అమెరికా, యూరప్‌లోని అధిక అక్షాంశ ప్రాంతాల్లో రాత్రి ఆకాశంలో 'అరోరా బొరియాలిస్'గా



పిలిచే రంగురంగుల కాంతులు కనిపించే అవకాశం ఉంది. ఆకుపచ్చ, గులాబీ, ఊదా వంటి రంగుల్లో ఆకాశం మెరిసిపోతూ కనిపించే ఈ సహజ దృశ్యం అంతరిక్ష ప్రేమికులకు కనువిందు చేయనుంది.

**అసలు ఈ సౌర తుఫాను ఎలా ఏర్పడింది?**

సూర్యుడి ఉపరితలంపై భారీ అయస్కాంత శక్తి ఒక్కసారిగా విడుదలైనప్పుడు శక్తివంతమైన సౌర విస్ఫోటనాలు చోటుచేసుకుంటాయి. వాటిలో భాగంగా సూర్యుడి కరోనా నుంచి భారీగా ప్లాస్మా, అయస్కాంత క్షేత్రాలు అంతరిక్షంలోకి విసిరివేయబడే ప్రక్రియనే కరోనల్ మాస్ ఎజెక్షన్ అంటారు.

ఆగస్టు 14న జరిగిన ఇలాంటి విస్ఫోటనం నుంచి విడుదలైన ప్లాస్మా మేఘమే ప్రస్తుతం భూమి వైపు ప్రయాణిస్తోంది. దీని వేగం, దిశ, అయస్కాంత బలం ఆధారంగా భూమిపై ప్రభావం తీవ్రత మారుతుంది. అందుకే శాస్త్రవేత్తలు దీని కదలికను నిరంతరం గమనిస్తున్నారు.

**ఉపగ్రహాలు, రేడియో వ్యవస్థలపై ప్రభావం ఉంటుందా?**

G1 స్థాయి సౌర తుఫానుతో సాధారణంగా భూమిపై పెద్దగా అంతరాయం ఏర్పడే అవకాశం ఉండదు. అయినప్పటికీ అంతరిక్ష వాతావరణ పరిస్థితులు ఉపగ్రహాల పనితీరు, అధికఅక్షాంశ విద్యుత్ వ్యవస్థలు, రేడియో కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలపై స్వల్ప ప్రభావాన్ని చూపే అవకాశం ఉంటుంది.

అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం ఈ తుఫాను వల్ల సాధారణ ప్రజలు భయపడాల్సిన పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు. విమాన ప్రయాణాలు, మొబైల్ ఫోన్లు, సాధారణ ఇంటర్నెట్ సేవలు వంటి రోజువారీ వ్యవస్థలకు పెద్ద స్థాయిలో అంతరాయం కలిగే సూచనలు లేవు.

**సూర్యుడు ఇప్పుడు 'యాక్టివ్ మోడ్'లో!**

ప్రస్తుతం సూర్యుడు తన సుమారు 11 ఏళ్ల సౌర చక్రంలో అత్యంత చురుకైన దశ అయిన సౌర గరిష్ఠ స్థితి చుట్టుపక్కల కాలాన్ని ఎదుర్కొంటున్నాడు. ఈ సమయంలో సూర్యుడిపై సన్‌స్పాట్లు, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్లు సాధారణం కంటే ఎక్కువగా చోటుచేసుకుంటాయి.అందువల్ల ఇటీవలి కాలంలో వరుసగా సౌర విస్ఫోటనాలు, భూ అయస్కాంత తుఫానులు నమోదవుతున్నాయి. సూర్యుడి కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ భూమికి చేరే అంతరిక్ష వాతావరణ ప్రభావాలను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయి.

**శాస్త్రవేత్తలకు మరో విలువైన అవకాశం**

ప్రస్తుతం భూమివైపు వస్తున్న ఈ చిన్న స్థాయి సౌర తుఫాను ప్రమాదకరమైనదిగా కాకుండా శాస్త్రీయ పరిశోధనలకు ఉపయోగకరమైన పరిణామంగా మారనుంది. సూర్యుడి నుంచి వెలువడిన కణాలు భూమి అయస్కాంత కవచంతో ఎలా పరస్పర చర్య జరుపుతాయి? ఉపగ్రహాలు, రేడియో కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలపై ఎంత మేర ప్రభావం ఉంటుంది? వంటి అంశాలను పరిశీలించేందుకు శాస్త్రవేత్తలకు ఇది మరో సహజ ప్రయోగంలా ఉపయోగపడనుంది.



# వంద మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం పీకలేరు



(మొదటి పేజీ తరువాయి)

రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం అన్నారు. అగ్గిపెట్టేరావు, అఘోరరావు మాటలు వింటే మోసపోతారని నిరుద్యోగులు నిరసనల్లో పాల్గొంటే కేసులతో ఇబ్బందిపడతారని హెచ్చరించారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అహర్నిశలు కష్టపడుతున్నామని స్పష్టం చేశారు.

**కార్యకర్తల రక్తాన్ని అమ్ముకున్నారు:**

రక్తదానం పేరుతో హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల రక్తాన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని సొమ్ముచేసుకున్నారని మీరు మనుషులా రాక్షసులా అని సీఎం ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబం రక్తపిపాసులుగా మారారని ధ్వజమెత్తారు. పార్టీలో పదవులు తీసుకున్న కేసీఆర్ కుటుంబం ఆయన బంధువులు ఎందుకు రక్తదానం చేయలేదు? అని నిలదీశారు. ప్రజల కోసం ఎంతవరకైనా కష్టపడతానని మీ ఆశీర్వాదం ఉన్నంత వరకు వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరన్నారు. సోషల్ మీడియాలో పెడితే ఒరిగేది లేదు కరిగేదని, రేపు శాసనసభలోనే తేల్చుకుందామన్నారు.

**బండకేసి కొట్టారు**

ఎప్పటికీ అధికారంలోనే ఉంటామని విర్రవీగిన వారిని వరంగల్ జిల్లా ప్రజలు బండకేసి కొట్టారని, తమను ఓడించేవారే లేరనుకున్న వారిని రాజకీయంగా బొందపెట్టారని సీఎం వ్యాఖ్యానించారు. కాకలు తీరిన రాజకీయ నేతలను యశస్విని రెడ్డి భారీ మెజారిటీతో ఓడించి ప్రజల తీర్పు ఏంటో చూపించారని గుర్తుచేశారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం చెప్పారు. బీఆర్ఎస్ రెండుసార్లు రుణమాఫీ పేరిట మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసి చూపించిందన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు జమ చేశామని, మొత్తంగా రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.లక్షా 37 వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. అ

**కవితను ఇంటి నుంచి పంపేశారు**

జైలుకుపోయి కష్టాల్లో వచ్చిన తన సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితను కేటీఆర్ ఇంటి నుంచి బయటకు పంపేశాడని ఇదంతా చూస్తున్న కేసీఆర్ తన కొడుకుకు బుద్ధి చెప్పాల్సిది పోయి మౌనంగా ఉండిపోయారని విమర్శించారు. ఇక అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. చేస్తున్నారని దుయ్యబట్టారు. అమాయకులైన బీఆర్ఎస్ కార్యకర్తల రక్తాన్ని హరీశ్ రావు, కేటీఆర్ ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని పైసలు సంపాదించుకుంటున్నారంటే వారు ఎలాంటివారో అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.















# సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు.

"ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మొదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలు తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తాం. ములుగు ప్రాంత అభివృద్ధికి ఏం కావాలో చెబితే నిధులు మంజూరు చేస్తాం.

**సీతక్కను సొంత ఆడబిడ్డలా..**

రక్తం పంచుకు పుట్టకపోయినా సీతక్కను సొంత ఆడబిడ్డగా చూసుకుంటున్నాం. కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే బయటకు నెట్టారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు.. రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా? కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారు. సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగభాగం ఉన్నట్లే. అలాంటి తండ్రీకుమారులు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులు. ఇంకొకరు అఘోరారావు.. అఘోరా పూజలు చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకున్నారు. దేవుడు మనవైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు. అని సీఎం అన్నారు.

**రేవంత్ నాయకత్వంలో ములుగు అభివృద్ధి: మంత్రి సీతక్క**

ములుగు అంటే గతంలో అభివృద్ధి లేని ప్రాంతం అనేవారని మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఈ జిల్లా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. "పదేళ్లు కొట్లాడితే ములుగు జిల్లా ఇచ్చారు. ఏడాదిలో మూడుసార్లు వనదేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్. రాష్ట్రంలో ఏ జిల్లాకూ ఇవ్వనన్ని ఇందిరమ్మ ఇళ్లు ములుగు జిల్లాకు ఇచ్చారు" అని చెప్పారు.






# విజయవాడలో లంచం బాగోతం

**విజయవాడ, మహా :** విజయవాడలో భారీ లంచం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రూ.179.50 కోట్ల విలువైన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.7 కోట్ల లంచం డిమాండ్ చేసిన ఆరోపణలపై ఓ రైల్వే ఇంజనీర్‌ను సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.15 లక్షల నగదు లంచం తీసుకుంటుండగా రైల్వే అధికారి బాపిరాజుతో పాటు ఆయనకు మధ్యవర్తిగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.

రైల్వే శాఖకు సంబంధించిన భారీ ప్రాజెక్టులో కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ దర్యాప్తులో ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. రూ.179.50 కోట్ల విలువైన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రాజెక్టులో ఏకంగా రూ.7 కోట్ల మేర 'బోనస్' లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం సంచలనంగా మారింది.

**రూ.15 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న సీబీఐ**

లంచం డిమాండ్‌పై సమాచారం అందుకున్న సీబీఐ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. డిమాండ్ చేసిన మొత్తంలో భాగంగా రూ.15 లక్షలు తీసుకుంటున్న సమయంలో రైల్వే ఇంజనీర్ బాపిరాజును అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఆయనతో పాటు లంచం వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం ఇద్దరి నుంచి కీలక పత్రాలు, లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అరెస్టు అనంతరం వారి నివాసాలు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లోనూ సోదాలు నిర్వహించే అవకాశం ఉంది.

**భారీ ప్రాజెక్టులో 'బోనస్' పేరుతో రూ.7 కోట్ల డిమాండ్**

ఈ కేసులో అత్యంత సంచలన అంశం రూ.7 కోట్ల లంచం డిమాండ్ ఆరోపణ. సాధారణంగా భారీ ప్రభుత్వ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లు ఎదుర్కొనే బిల్లుల చెల్లింపులు, పనుల ధ్రువీకరణ, అనుమతులు తదితర అంశాలను ఆసరాగా చేసుకుని లంచాలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వస్తుంటాయి. అయితే ఈ కేసులో రూ.179.50 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి ఏకంగా రూ.7 కోట్ల మేర డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.

సీబీఐ దర్యాప్తులో ఈ మొత్తం ఎవరికి చేరాల్సి ఉంది? లంచం డిమాండ్ వెనుక మరెవరైనా అధికారులు ఉన్నారా? ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్ పాత్ర ఏమిటి? అనే కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

**రైల్వేలో అవినీతిపై సీబీఐ నజర్**

భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో అవినీతి, అక్రమ లావాదేవీలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు నిఘా కొనసాగిస్తున్న నేపథ్యంలో విజయవాడలో ఈ అరెస్టులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా రైల్వే వంటి కీలక మౌలిక వసతుల సంస్థకు సంబంధించిన వందల కోట్ల ప్రాజెక్టులో లంచం డిమాండ్ ఆరోపణలు రావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రస్తుతం బాపిరాజు, శ్రీచంద్‌లను సీబీఐ అధికారులు విచారిస్తున్నారు. లంచం వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా? డిమాండ్ చేసిన రూ.7 కోట్ల మొత్తంలో ఇప్పటికే ఎంత మేరకు లావాదేవీలు జరిగాయి? ప్రాజెక్టుకు సంబంధించిన ఏ పనులు, బిల్లులు లేదా అనుమతుల కోసం ఈ మొత్తాన్ని డిమాండ్ చేశారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

రూ.179.50 కోట్ల రైల్వే సిగ్నలింగ్ ప్రాజెక్ట్.. రూ.7 కోట్ల లంచం డిమాండ్.. చివరకు రూ.15 లక్షలు తీసుకుంటూ సీబీఐకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఇంజనీర్.. ఈ మొత్తం వ్యవహారం విజయవాడ రైల్వే వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఈ కేసులో మరిన్ని సంచలన వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పరకాల నుండి మళ్ళీ రేవూరే

- సీఎం రేవంత్ సంచలన ప్రకటన
- కొండా ఆశలకు గండి

**పరకాల, మహా :** వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు సుష్మితను బరిలోకి దించాలన్న యోచిస్తున్న మంత్రి కొండా సురేఖకు సీఎం రేవంత్ రెడ్డి షాకిచ్చారనే చెప్పాలి. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించిన సీఎం.. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం వెయ్యిమంది కేసీఆర్‌లు వచ్చినా తమ వెంట్రుక కూడా పీకలేరని, 2029లో రెట్టింపు మెజారిటీతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించాలని కోరారు. అందులో భాగంగా రానున్న ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డే మరోసారి పోటీ చేస్తారని బహిరంగ ప్రకటన చేశారు. దీంతో కొండా ఫ్యామిలీ ఆశలకు గండిపడ్డట్లయింది.



# 'టీజీ సేఫ్'.. కల్తీకి చెక్

- ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. 'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 17-08-2026



## జీవితాల్ని మోస్తున్న శరీరాలు

వారి వారి అమ్మానాన్నల
జీవకణాలతో
అమ్మానాన్నలు

ఎవరి జీవకణాల్లోనైనా
ఎందరెందరు
అమ్మానాన్నలో

నారూ నీరూపోసి
పెంచబడుతున్నట్టు
శరీర జీవితాలు

ఆయా సమయాల్లోనే వచ్చే
ఈగల్లా
లేదా
వసంతంలా
వస్తూ పోతూ
***
తల్లి శరీరంలో
భాగం కదా బిడ్డ
ఆ బిడ్డలో
తల్లీ తండ్రి ఉండరా
ఆడా మగా
రంగూ రూపం
కులం మతం
భాషా ప్రాంతం
ఎవరు ఎవరో
తెలియకపోయినా
పెరుగుతున్నకొద్దీ
బంధనాల భ్రమల
సాలెగూడు
***
ప్రవేశానికే తెరిచి
మూసేసిన తలుపులు
నిష్క్రమణానికి తెరిచే వరకూ
విడుదల తేదీ తెలియని
ఖైదీ జీవులు

నేల రుచి తెలిసిన పచ్చికలా
సంచార రక్తానికి
తెలిసిన గుండె చప్పుడు
ఆగిన అమాంతం
శరీరాన్ని విడిచే జీవితం


ముకుంద రామారావు
990 834 7273

## నిశ్శబ్దానికి ఆవల

కోలాహలం
ప్రపంచం మాట్లాడే భాష
నిశ్శబ్దం
మనసు పలికే కవిత
దాని దగ్గరికి చేరడానికి
చాలా దూరం నడవాల్సిన పనిలేదు
మనలోని ఒక్క అహంకారాన్ని దాటితే చాలు

కాలం ఒట్టి గడియారాల మీద కాదు
గాయాల మీద నడుస్తుందని అక్కడే తెలుస్తుంది
ప్రతి అడుగు ఓడిపోవడం కోసం వేయం
భూమి చేతిని పట్టుకోవడం కోసం వేస్తాం
ప్రతి శ్వాస గాలి కాదు
అది మన పేరును విశ్వం ధ్వనించే క్షణం
అన్ని ఉదయాలు సూర్యుడితోటే మొలకెత్తవు
కొన్ని కన్నీటి చుక్కల్లో ఉదయిస్తాయి
అన్ని తుఫాన్లు చెట్లను కూల్చవు
కొన్ని మనలోని భయాలను వేళ్ళతో సహా పీకేస్తాయి

ఎదురుచూపు ఎల్లప్పుడూ వృథా సమయం కాదు
విత్తనం చీకటిలోనే వెలుగును నేర్చుకుంటుంది
వెనక్కి తిరిగి చూసిన రోజు నీ ప్రయాణాన్ని
నీ అడుగులు చెప్పవు
నీ పాదాల కింద అరిగిపోయిన రాళ్లే చెబుతాయి
చివరికి గమ్యం అంటే
చేరుకున్న చోటు కాదు
దారిలో ప్రయాణంలో
మనిషిగా మిగిలిన మనసే


వారాల ఆనంద్

# దళిత మహిళ ఆత్మకథ: 'గునుగుపూలు'

అయిదు దశాబ్దాల కిందట నేను ట్రైనింగ్ లో వున్నప్పుడు ముసహర్, ఖోండ్, సంతాల్ తెగల ఆదివాసి కూలీలను చూశాను. వీళ్ళు బీహార్, బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో వున్నారు. వాళ్ళ రూపం, వేషభాషలు చూసి వాళ్ళ జీవన విధానం స్వర్ణామాత్రంగా తెలుసుకుని ఆశ్చర్యపోయాను. తర్వాత చాలా ఏళ్లకు Hunger Sociology లో ప్రముఖ పరిశోధకుల నివేదికల్లో ఈ తెగల వారి గురించి మరిన్ని విషయాలు చదివి ఆశ్చర్యంతో పాటు చాలా బాధనిపించింది. చక్రభ్రమణంగా దాపురించే దుర్భర కరువుకాలంలో, తిండి దొరకని పరిస్థితుల్లో ఈ ఆదివాసి తెగలవాళ్ళు పశువుల పేడలో జీర్ణం కాని ధాన్యపు గింజలను ఏరుకుంటారు. ఎండిన చేలలో ఎలుకల కలుగుల్లోంచి వడ్లు, జొన్నలు లాగి కుప్ప చేసుకుంటారు, ఎలుకల్ని, ఇతర చిన్న జంతువుల్ని కాల్చుకుని భుజిస్తారు.

ఈ రాష్ట్రాల్లో వరి, ఇతర ఆహార ధాన్యాలు సమృద్ధిగా పండుతాయి, ప్రభుత్వ గిడ్డంగుల్లో నిల్వ వుంటాయి . కానీ భూమి లేకపోవడం, తీవ్ర పేదరికం, నిరక్షరాస్యత, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం అలసత్వం, పంపిణీ వ్యవస్థలోని లోపాల వల్ల ఏ ప్రయోజనమూ అందక ఈ బలహీన, అణగారిన వర్గాల ప్రజలు (ఎస్సీ, ఎస్టీ, ఆదివాసులు) ఆకలితో, కనీస సౌకర్యాల లేమితో అలమటిస్తారు. వీరి తిండి ఆలవాట్లు, జీవన విధానం నిమ్నస్థాయిలోనూ, పూజించే దేవుళ్ళు, ఆచారవ్యవహారాలు, నమ్మకాలు భిన్నంగానూ వుంటాయి. వీరి ముఖ్య బలహీనతలైన భూమి లేకపోవడం, తీవ్ర పేదరికం, నిరక్షరాస్యతలకి ప్రధాన చారిత్రిక కారణం.. కరడు గట్టిన వర్ణవ్యవస్థ. ప్రపంచంలో మరెక్కడా లేని నిచ్చెన మెట్ల కులవ్యవస్థ భారతదేశంలో వున్నది. దీనికి సంబంధిన ఫ్రేం వర్క్ ని, కఠిన నియమాల్ని స్మృతులు, పురాణాలు నిర్దేశించాయి. మెట్ల వరుసలో పైనున్న సవర్ణ హిందువులు అట్టడుగునున్నవారిని అస్పృశ్యులు, చండాలురు అన్నారు, వారిని ఊరి బయటే మురికి పరిసరాల్లో ఉంచారు, పశువులకన్నా హీనంగా చూశారు, వారితో వెట్టి చాకిరీ, ఊరుమ్మడి సేవలు, పరమ అపరిశుభ్రమైన పనులు చేయించుకున్నారు.

అట్టడుగు వర్గాలైన ఎస్సీలు, వారి ఉపకులాలు ప్రాచీన కాలం నుంచి అనుభవించిన శ్రమదోపిడి, హింస, అవమానాలు, దీన హీన (sub human) స్థితిగతుల గురించి బి ఆర్ అంబేద్కర్, పూలే..ప్రభృతులు విపులంగా రాశారు. భారతీయ నిరంకుశ వర్ణవ్యవస్థలో ఎస్సీల స్థితి ప్రాచీన రోమన్ పాలకుల నాటి బానిసల కన్నా, నిన్నమొన్నటి అమెరికాలో నల్లజాతి వారి కన్నా కడు హీనమైనది; వాళ్లకి జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక రకంగా విముక్తి పొంది సామాజిక స్థాయి మారే అవకాశముండేది, కానీ ఈ దేశంలో ఎస్సీ / దళిత్ గా పుట్టిన వ్యక్తి ఏ వృత్తి/ ఉపాధిలోవున్నా జీవితాంతం కులం ట్యాగ్ మోయాల్సిందే , అది ఆనువంశికం, అతని పిల్లలకు కూడా ఆ కులం వారిగానే గుర్తింపు, అది మారదు. ఎస్సీలు, ఎస్టీలు, వారి ఉపకులాల పట్ల జరిగిన అన్యాయాలు, అక్రమాలు, ఇతర కులస్తులు శూద్రులు సహా వారిపై చూపిన అమానవీయ వివక్ష లింబాలే , దేవనూర మహాదేవ ..మొదలైన వారి రచనల్లో కళ్ళకు కట్టినట్టు కనపడుతుంది. వలస పాలన పూర్వం నుంచి తెలుగు కన్నడ మరాఠి భాషలలో ప్రత్యేకించి దళిత సాహిత్యం ప్రాచుర్యంలో వుంది. బ్రిటిష్ పాలకులు ఇక్కడి కులవ్యవస్థ జోలికి పోలేదు, కానీ స్కూళ్ళు నెలకొల్పి అందరికీ చదువుకునే అవకాశం కల్పించారు. మత మార్పిడి ప్రో



త్సహించారు. స్వాతంత్ర్యానంతర కాలంలో రాజ్యాంగ పరంగా ఎస్సీ, ఎస్టీలకు హక్కులు, రక్షణలు కల్పించినా కూడా వారి పట్ల వివక్ష పోలేదు, నేటికీ సమానావకాశాలు దక్కడం లేదు అనడానికి అనేక దృష్టాంతాలు వున్నాయి. అందుకని వాళ్ళ సంఘటిత ఉద్యమాల్లోని సమరశీలత, ధిక్కార ధోరణి... అనేక శతాబ్దాల నుంచి సాగుతూ వస్తోన్న వివక్షకు, అణచివేతకు వ్యతిరేకంగా వాళ్ళు వెలిగక్కుతున్న సహేతుకమైన ఆక్రోశం, న్యాయాగ్రహమని సాటి సమాజం గుర్తించాలి.

ఒక మారుమూల పల్లెటూరిలో ఎవుసం జీవనాధారంగా కాయకష్టం చేసుకు బతికే దళిత (మాదిగ) కుటుంబంలో కడుపు పోవడానికి తల్లి పసరు మందు తాగినా మొండిగా జీవం నిలుపుకుని పదకొండో సంతానంగా పుట్టి సింగరేణి కాలరీస్ కార్మిక వాడలలో పెరిగి హైస్కూల్ దాకా చదివి తర్వాతి ఉన్నత చదువులు వరంగల్, హైదరాబాద్ లో ముగించి గ్రూప్ పరీక్ష నెగ్గి ప్రభుత్వ ఉద్యోగం కొట్టి సచివాలయంలో అదనపు కార్యదర్శి స్థాయికి ఎదిగి రిటైరైన ఒక మహిళ...తన జీవన పయనంలోని సంఘర్షణాయుత, సంకటమయ అనుభవాలను సొంత సామాజికవర్గ సంస్కృతి, జీవన శైలి ప్రతిధ్వనించే నుడికారాలతో సజీవ ప్రాంతీయ భాషా మాండలిక యాసలో అక్షరీకరించి 56 ఖండికలుగా గుదిగుచ్చి అందించిన గుచ్ఛం ' గునుగుపూలు '. రచయిత్రి, కవయిత్రి, వ్యాసకర్త , పరిశోధకురాలు, సోషల్ ఆక్టివిస్ట్ ఐన జూపాక సుభద్ర భాష , శైలి అనన్య సామాన్యమైనది !

ఈ 'ఆత్మకథనం'లోని కొండొకచో memoirs అనిపించే episodes సహా దాదాపు అన్ని ఖండికలు, తీవ్ర కులవివక్ష, రకరకాల అణచివేత, దోపిడీ, సామాజిక ఆర్థిక జెండర్ అసమానతలు ఎదుర్కొన్న ఒక స్త్రీ.. ఆత్మగౌరవం, మానవహక్కులు, సాధికారత కోసం మొక్కవోని విశ్వాసంతో, నిత్య చైతన్యంతో పోరుసల్పిన క్రమంలో సమాజాన్ని వివిధ కోణాల్లో 'క్లిక్' మనిపించిన snapshots. క్రానాలజికల్ ఆర్డర్ లో లేకున్నా ఇవి ప్రధానంగా హిందూ సమాజ చట్రంలో దళితుల వెనుకబాటుతనాన్ని, వారి జీవన విధానాన్ని, శ్రమైక జీవన సౌందర్యాన్ని, కుటుంబ సభ్యుల ప్రేమానురాగాల్ని, అనుబంధాల మాధుర్యాన్ని చిత్రించడంతో పాటు... స్థూలంగా తెలంగాణ ప్రత్యేకించి ఆదిలాబాద్, వరంగల్ , హైదరాబాద్ జిల్లాల - '60 ల నుంచి ఆరు దశాబ్దాల సామాజిక ఆర్థిక రాజకీయ పరిణామ క్రమంలోని పలు పార్శ్వాలని ప్రతిబింబిస్తాయి.

అవిద్య, అజ్ఞానం, అధిక సంతానం, బాల్య వివాహాలు, రోగాలొస్తే మందు మాకుల్లేని స్థితి, నాటు వైద్యంతో, దేవుళ్ళ మొక్కులతో ఉపశమనం, పాలేర్లుగా, పశుకాపర్లుగా జీవితాలు, దొరల దౌర్జన్యాలకు, లైంగిక దోపిడీకి ఎదురు తిరగలేని నిస్సహాయత, వెట్టి, నీరడితనం బానిస బతుకులు, లేకి, పరిగెలలో చేలల్లో గింజలు ఏరుకునే దుస్థితి, నిండు గర్భిణి ఏకంగా 15 మైళ్ళు నడిచి వెళ్ళాల్సిన పరిస్థితి..మొదలైన వాటి గురించిన దయనీయ వృత్తాంతాలు చాలా చెప్పారు రచయిత్రి. జబ్బులు, ఇతరకష్టాలొచ్చినప్పుడు 'వల్లు' పట్టించడం, దేవుళ్ళనడగడం, పెళ్ళిలో దూడపెయ్యను కోసి భోజనాలు పెట్టడం, నిత్యం జొన్న గటక తినలేక పిల్లలు మెతుకులన్నం కోసం వెంపర్లాడిపోవడం, రొయ్యలో చాపలో తునకలకూరో ఏదో ఒక నీసు మాత్రమె ఆదరువుగా ఉండటం, పూలగౌనుతో మురిసిపోయిన పసిమనసు, ఇంట్లో వాళ్ళు వద్దంటే చెప్పులు వదిలేసి ఎండలో బొగ్గు బాటల్లో నడిచిన బాల్యం ..వగైరా కుటుంబ విషయాలు వివరించిన తీరులో భేషజం లేని వాస్తవికత వుంది. తలిదండ్రుల ప్రోత్సాహంతో 'తడకల బడి'లో చేరడం, ఇంటి భాషకు, పుస్తక భాషకు నడుమ తేడా మొదట్లో ఇబ్బంది పెట్టినా, టీచర్ల దండింపులు భయపెట్టినా, చదువు పట్ల ఆసక్తి పెంచుకుని ముందుకు సాగిన క్రమంలో బస్తీ , పట్టణ వాతావరణంలోకి ప్రవేశించడంతోపానగండంగా , కొత్త స్నేహాల ప్రభావంతో రచయిత్రి చైతన్య స్థాయి పెరుగుతుంది. మారిన హాస్టల్ రూల్స్ , కొత్త పరిసరాలు, డబ్బుకు కటకట, ఇతర ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా ఒంటి పూట భోజనంతో సరిపెట్టుకుని పట్టుదలగా చదువు పూర్తి చేయడం, ఆ క్రమంలోనే పిడిఎస్యూ విద్యార్థి సంఘ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొనడం, అరెస్ట్, విశాఖపట్నం జైలులో స్వల్పకాల రిమాండ్, అక్కడ సీనియర్ విప్లవోద్యమ నాయకులతో పరిచయం, ఆ తర్వాత అంబేద్కర్ రచనల అధ్యయనం, తద్వారా ఏర్పడ్డ అభిప్రాయాలు, విస్తారమైన జీవితావగాహన...ఇన్నన్ని అనుభవాలు, జీవిత ఘట్టాలు వివరిస్తారు సుభద్ర. తల్లి తరపు వాళ్ళ కష్టాలు, తండ్రి ప్రేమ, తల్లి, అక్కల అనురాగం, సాదుకానికి తీసుకుని చదివించిన పెద్దన్న వాత్సల్యం ఆర్ద్రంగా చెప్పారు. బెల్లంపల్లిలో 'సూదరోళ్ళ' తో కలిసి మెలిగిన రోజులు , సద్దుల బతుకమ్మ సంబురాలు సంతోషంగా గుర్తు చేసుకుం టారు. బెల్లంపల్లి పోలీస్ కాల్పుల ఘటనలో కాలికి తూటా దెబ్బ తగిలిన దుర్గక్క, హాస్టల్ లో కులం పేరుతొ కించపర్చినందుకు తనతో తన్నులు తిన్న క్లాస్ మేట్, హాస్టల్ గొడవలు, వార్డెన్ సతాయింపులు, పులిని గెదిమిన తల్లి పెద్దవ్వ అంకుసవ్వ.. . ఈ ప్రస్తావనల ద్వారా తెగువ, ధిక్కారం తమ జాతి జన్యువుల్లోనే వున్నాయని సూచ్యంగా చెబుతారు రచయిత్రి.


జూపాక సుభద్ర
సెల్ : 9441001305

యూనివర్సిటీ చదువు అవగానే రిజర్వేషన్ లేకుండా ర్యాంక్ సాధించి రాష్ట్ర సెక్రెటేరియట్ లో ఉద్యోగంలో చేరడం రచయిత్రి జీవితంలో ముఖ్య మలుపు. అక్కడా ఎదురైన కుల , జెండర్ వివక్షను ఎదుర్కొని, తోటి ఉద్యోగులను చైతన్యపరిచి, ఉద్యోగ సంఘం నాయకురాలిగా, మహిళల నేతగా ఎదిగి పలు హక్కులు డిమాండ్లు సాధించి, అందరికీ ఆత్మీయురాలిగా మెలిగి ప్రశంసలందుకున్న విషయాలను తను మర్చిపోలేని జ్ఞాపకాలుగా మనతో పంచుకుంటారు సుభద్ర. ఒక మారుమూల మాదిగ గూడెం నుంచి సచివాలయంలో ఉద్యోగిగా చేరి, అనేక ప్రజాఉద్యమాల్లో పాల్గొని, చాలా మందికి మార్గదర్శిగా నిలిచి ధీరవనిత అనే మెప్పును పొంది, తన రచనలకు, సాఫల్యాలకు అనేక రివార్డులు, అవార్డులు పొంది, తెలంగాణ / తెలుగు సాహిత్యంలో తనదంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సముపార్జించుకున్న సుభద్ర ఆత్మకథనం 'గునుగుపూలు' బడుగు బలహీన వర్గాల మహిళలకు నిజంగా స్ఫూర్తిదాయకం. తాను ఎదిగిన క్రమంలో నడిసొచ్చిన దారుల్లోని వివిధ దశలను, జీవితానుభవాలను అచ్చమైన తెలంగాణ భాషలో, యాసలో, జిల్లానిర్దిష్ట నుడికారాల మేళవింపుతో ఆసక్తికరంగా వివరించారు రచయిత్రి. గెదుముడు, సప్పదిప్ప దంచుడు, కారెడ్డం, పతార, కాయిషు, పసిద్ధవుడు, పానగండంగా , కమానంగా ...తదితర పదాలు, పదబంధాలు అర్థం చేసుకోవడానికి ఇతర ప్రాంతీయులు శ్రమ తీసుకోవాల్సిందే.


-ఆడెపు లక్ష్మీపతి
సెల్ : 9701227207

# "నా స్వదేశానికి తిరిగి రాక" లో కవితాఝరి

ఎమే సెజైర్ (19132008) ఫ్రెంచ్ మార్టినీక్ దీవిలో బాస్‌పాయింట్ లో జన్మించారు. తను పారిస్ లో చదువుకుంటున్నపుడు సెంగార్, దమాస్ లతో కలిసి 'నెగ్రిట్యూడ్' ఉద్యమం ఆరంభించాడు. ఇది 1930లలో నల్ల జాతి రచయితలు ప్రారంభించిన సాహిత్య , సాంస్కృతిక ఉద్యమం. వలసవాద వ్యతిరేకంగా ' రిటర్న్ టు ది నేటివ్ లాండ్,' 'డిస్కోర్స్ ఆన్ కలోనియలిసం,' 'ఏ టెంపెస్ట్,' 'ఏ సీజన్ ఇన్ ది కాంగో,' 'ది ట్రాజెడీ ఆఫ్ కింగ్ క్రిస్టోఫే,' 'అండ్ ది డాగ్స్ వర్ సైలెంట్' తదితర ప్రఖ్యాత రచనలు చేశాడు. ఈ నాడు దేశ దేశాల్లో అణచివేతను వ్యతిరేకించే అందరికీ ఈయన రచనలు స్ఫూర్తి కలిగిస్తాయి.

సెజైర్ ఈ పుస్తకంలో అధికారాన్ని తిరస్కరిస్తూ,తన పట్టణం గురించి, ఇంటి గురించి , నల్ల జాతి అణచివేత గురించి, ఐరోపా చెప్పిన అబద్ధాల గురించి, తిరిగి మేల్కొన్న నెగ్రిట్యూడ్ ఉద్యమం గురించి , రేపటి రోజున తూర్పున ఉదయించే మార్పు గురించి అత్యంత ఉద్వేగాత్మక, కవితాత్మక, ఆలోచనాశీల శైలిలో రాసిన రచన. మాటల్లో శక్తిని, నల్లవాడిని అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని, స్వేచ్ఛ కోసం అతని కలవరింతను చెబుతాడు. అర్థం లేని చావులు విమర్శిస్తూ ,జీవితం కోసం ఆర్తిని , పట్నం గురించి కవి వర్ణిస్తూ నిర్భయంగా, బహిరంగంగా దాని కుళ్ళును వర్ణిస్తాడు.

సెజైర్ ' రిటర్న్ టు ది నేటివ్ లాండ్,' లో తన దేశం కోసం , దాని గాయాల ఒంటరి వికారం కోసం, దానికోసం పలికేందుకు తిరిగి వచ్చాడు.జీవితం ఒక దృశ్యం కాదని, ప్రేక్షకుడిలా నిస్సార దృక్పథం చూపక జాగ్రత్త పడమంటాడు. "నేను వచ్చాను" అని ప్రకటిస్తాడు. తాను చూసే చావు అర్థం , పవిత్రత, గౌరవం లేనిదని, తనకు జీవితాన్ని అంచనా వేసేందుకు హక్కు లేదని అంటాడు. కవి తన దేశం గురించి, తన జాతి గురించి, తమను హేతువు పేరు మీద అణచివేయడం గురించి చెబుతూ తన అస్తిత్వాన్ని సమర్థించుకుంటాడు.

తాను ఐరోపా నిరాశను, పిరికితనాన్ని విమర్శిస్తూ అందమైన ఇగోయిజం కోరతాడు .కవి తాను చిరు గంటల్లో జరిగిన, ఒరిగిన వస్తుజాలాన్ని, పాత గాయాలను, ఎముకలని, బందీ అయిన అగ్ని కొండల్ని అంగీకరిస్తానంటాడు.తన నెగ్రిట్యూడ్ సహనం. తమ నల్ల జాతిది ప్రకృతితో సామరస్యం. విజేత తెల్ల జాతిని చూసి జాలిపడాలి.

తనకు మంత్రగాడి నమ్మకం , చేతులకు క్రియాశక్తి , ఆత్మకి కత్తి పదును ఇమ్మని ,దృఢంగా ఉంటానని , ప్రజాప్రేమికుడిని కావాలని కోరుతాడు. గర్వానికి వ్యతిరేకంగా, శ్రామికునిగా చేయమంటాడు. ద్వేష మనిషిగా చేయొద్దని, విశ్వ ఆకలి ,దాహం తీరాలంటాడు. ఫలవంతమైన జాతి జనించాలంటాడు.కవి తన కొత్త పెరుగుదలను చుట్టూ కప్పుకోమంటాడు. తమ జాతిని ముద్దాడమంటాడు.

**పట్నం చదునుగా, నిర్జీవంగా, మూగగా.**

తెల్లవారుజామున కవి పోలీసులు, అధికార దుస్తులు ఆశగాలాన్ని ద్వేషిస్తాడు. తెల్లవారుజాములో మార్కెట్ కు వెళ్లేందుకు మొలకెత్తిన చేతి సంచులు. సాక్ష్యం చెప్పని అమరవీరులు ,నిశ్శబ్దంలో బాధతో తెరిచే ముసలి పెదాలు. తన ఆకలి బాధ, తిరుగుబాటు గొంతు తానే ఇవ్వని సందడి చేసే గుంపు. ఒంటరిగా ఉండే గుంపు.

ప్రతిదాన్ని , వ్యక్తీకరణను, విముక్తి ప్రదాతను, స్వేచ్ఛను తిరస్కరించే పట్నం. తన్నుతాను తిరస్కరించే పట్నం. కుష్టు,



వినియోగం, కరువులు, ప్రకృతిలో భయాల దొంతర. ఎలా పేలాలో మరిచిన, విస్మరించబడిన మోర్న్ పట్నం. దాని మలేరియా రక్తం, నిరోధించిన నిప్పు, ఆకలి బాధలు, కరువు ఆత్మహత్యలు. ఆకలితో మతి పోయి, సగం నిద్రలోని, పనికిరాని నల్ల పిల్లవాడు గొంతు నుంచి ఒక్క మాట కూడా రాబట్టలేని టీచర్, ప్రీస్ట్ లు. అవినీతి, మూర్ఖత్వం, వ్యభిచారం, హిపోక్రసీ, దురాశ, వక్రత్వం , దిగజారిన తనంతో విరిగిన వారికి సాదా బీచ్. నిజమైన దుఃఖాన్ని కవికి తెలిపే సుదూర ఆనందం .సముద్రం యొక్క గొప్ప హిస్టరీకల్ నాలుక.

కాలం గడిచి క్రిస్మస్ వచ్చింది. బాగా పండిన దానిమ్మ పండు లాంటి అకస్మాత్తు అందం. నిరంతర కలకలం. నల్ల వారి సర్వాంగాల సంగీతం. అవినీతి, మూర్ఖత్వం, వ్యభిచారం, హిపోక్రసీ, దురాశ, వక్రత్వం , దిగజారిన తనంతో విరిగిన వారికి సాదా బీచ్. నిలబడి నిరసనతో ఆకాశాన్ని చీల్చే అత్యంత స్వల్ప కోరిక లేకుండా, మొహంపై బోర్లా పడిన జీవితం.

**క్రూరమైన చిన్న ఇల్లు**

ఆరుగురు సోదరులు, సోదరీమణులు .తండ్రి అనూహ్య స్పందన. ఆకలి కోసం సదా సింగర్ మెషిన్ తొక్కే అమ్మ కాళ్ళు. ఈ పాయూ వీధి ఈ పట్టణ మర్మ అవయవాల్లా జుగుప్సాకరమైన తోక.సముద్ర చెత్తను వదిలే బీచ్ కు అనుకున్న వీధి___బాధ పడే మనిషిని.. ఎవరికీ జవాబుదారీ కాకుండా చంపవచ్చు___కానీ పశ్చాత్తాపాన్ని చంపగలమా?

**నల్ల జాతి వీరుల ప్రశంస**

టుసాన్ లూవెర్ట్యూర్. చావు అతని తల మీద తేజ వలయం / తార. తన చేతుల చెరకు తోటలో వీచే పిచ్చి గాలి, తెల్ల గుర్రంలా జైల్లో పరిగెత్తుతూ, చీకటిలో పిల్లికళ్ళ లా మెరుస్తూ, సముద్రపు దిబ్బ కింద నీటిలా గుటకలేస్తూ, గాయపడిన పక్షి, తగ్గుతూ, సందేహిస్తూ , నిశ్శబ్ద తెల్లగుంటలో మరణిస్తుంది.

"మేము మాట్లాడాలి. మేము పాడాలి. మేము అరవాలి." చెట్టును చూసి చెట్టు అయ్యాను. కాంగో గురించి యోచించి అడవులలో నిద్రలో సవ్వడి చేసే కాంగోను అయ్యాను .

నా నేరాలు ప్రకటిస్తా, నా తరఫున చెప్పేది ఏమీ లేదు. చంపాను దేవుణ్ణి నా సోమరితనంతో నా మాటలు , సంజ్ఞలు ,నా బూతుపాటలతో___

వూమ్ రో వా. పాముల్ని ఆడించేందుకు, అలలు దాటు నిమిత్తం వానను ఆపేందుకు. రహదారిపై చెరుకు తినే కు ర్రవాడిని, రక్తదారిపై గొంతు చుట్టూ ఉరితాడు మనిషిని, ఒక పెద్ద సర్కస్లో నిలబడిన నా నల్ల నుదురుపై ఉమ్మెత్త పూల కిరీటం___

వూమ్ రో వా. ఎవరు నా గొంతు నొక్కింది? నీవే. నూరేళ్ల కొరడా. నూరేళ్ల ఓర్పు. నాకోసం నీవు సర్దుకో. నీకోసం నన్ను నేను సర్దుకోను.

శతాబ్దాల పాటు నల్ల వారిని జంతువులుగా, నడిచే ఎరువుగా, బానిసలుగా చూశారు. పేదరికం వారిని పరి మార్చింది. రైలులో ఒక అలసి సొలసిన నీగ్రో ని చూసి నవ్వుతున్న ఆడవారితో కలిసి తాను చిరునవ్వు నవ్వినందుకు, నేరంలో భాగమైనందుకు పిరికి తనంచూసి మొహంపై వుమ్మేయమని డిమాండ్ చేస్తున్నా..

**నేను అంగీకరిస్తా**

చిమ్మిన రక్తం జామెట్రీ తో రంగు వేయబడ్డ జాతి జాగ్రఫీ ని అంగీకరిస్తాను అని. నెగ్రిట్యూడ్ ఏమాత్రం శిరో సూచిక కాదు. నిరాశామయ చేతుల్లో క్షతగాత్రమైన దేశం. అకస్మాత్తుగా జవసత్వాలు ఎద్దులా కుమ్మాయి. జీవన తరంగం మోర్న్ పట్న స్తనంపై పారింది. సిరల్లో కొత్త రక్తం. తుఫానులా పెద్ద శ్వాస కోశాల్లో బ్రీతింగ్.

శతాబ్దాలుగా ఐరోపా చెప్పిన అబద్ధాలు. ఏ జాతికి అందం, తెలివి, బలంపై లేదు ఏక స్వామ్యం. ఇక సూర్యుడు తిరగాలి తమ భూమి చుట్టూతా. ప్రతితార భూమిపై రాలేదీ,ఆగేది తమ ఆజ్ఞను బట్టి. దేశం ప్రాచీన బాంబ్రాల రాత్రి బల్లెం.

బహు మంచి 'నీగ్రో' అంటే విధిని ఎదిరించలేక, దయలేని దేవుడు విధించిన ఆంక్షలు పాటిస్తూ తన విలువ లేని తనాన్ని నిజాయితీగా నమ్మి చెరకు తోటలో పనిచేసేవాడు. అతని మీద గాయాలు. పాత నెగ్రిట్యూడ్ శవమే అయింది. మాట్లాడేది ఎందుకంటే మరో సాగరం తరించేందుకు, ఊపిరి తిత్తులు నవకల్పనకు, మరో ఉన్మాదికి స్వేచ్ఛ కోసం, ఆత్మ ప్రకాశించేందుకు.

సామ్రాజ్యవాద దురాక్రమణకు ఇరాక్, ఇరాన్, వెనిజులా, క్యూబా మొదలగు దేశాల వారికే కాక కుల, మత, జాతి, లైంగిక అణచివేతకు బాధపడే జనులకు నేటి తరుణంలో సెజైర్ రచన ఒక ఉత్తేజాన్ని ఇస్తుంది.


–డా.జె. రవీంద్రనాథ్
8978131585

## బొద్దింకల భూకంపం!!

చదువుల నావను
నడిసంద్రాన ముంచిన ముష్కరులు
లీకుల ధోకాను
నిత్యకృత్యం చేసిన ప్రబుద్ధులు
అకాల మరణాలను బహూకరించి
చోద్యం చూస్తున్న 'ప్రదాన్'లు

రెక్కలు విప్పిన అహంకారాలకు
బొద్దింకల మడమతిప్పని చెక్

ఐపీఎల్ మ్యాచ్‌ల చుట్టూ
యువ మెదళ్లను కట్టిపడేయాలని
ఒక పగటి కలను కన్నాయి ఏలికలు
భగ్గునమండే నిప్పుకణికల్లాంటి
బొద్దింకల దండయాత్రను చూసి
కనిపించని కలుగుల్లో
దిక్కుతోచక దాక్కున్నాయి గుంటనక్కలు!

భారత్‌మాతకు జై
అంబానీ, అదానీలకు సై
నోటితో నినాదాలు
నొసటితో వెక్కిరింపులు
వీధుల్లో విద్వేషపు స్ప్రే
దేశభక్తి ఇప్పుడు
ఈవీఎం మిషన్‌లో చిక్కుకుంది
దేవుడే ఎలక్షన్ అంబాసిడర్!

భక్తి మాటున దూస్తున్న
విద్వేషపు కత్తులకు
నెత్తురోడుతున్న ప్రజాస్వామ్య కపోతం
సామరస్యత ఇప్పుడొక
ఔట్ డేటెడ్ మెడిసిన్!

బొద్దింకల భూకంపానికి
పునాదులు కదులుతున్నాయి

మధ్యయుగాల దారిలో
మభ్య పెడదామనుకున్నవారికి
నోటి మాట బందై పోయింది
బొద్దింకల ప్రభంజనంలో
కాషాయ సామ్రాజ్యం కుదేలైంది
విర్రవీగిన పీఠాల
కూసాలు కదులుతున్నాయి

ప్రశ్నించడం బొద్దింకల జన్మహక్కు
నినదించి నిరసన తెలపడం వారికున్న దిక్కు
ఆపేందుకు నిందలేసి అపసోపాలు పడి
మసిబూసి మారేడు కాయ చేయడం
మీ సహజమైన ఎత్తుగడల చిక్కు

బొద్దింకలు ఏం చేస్తాయి...?
అవసరమైతే మీ గద్దెలను కూలుస్తాయి
బొద్దింకలు ఎక్కడుంటాయి...?
పాలించడం చేతగాని దద్దమ్మల
గుండెల్లో నిదురిస్తాయి!!
బొద్దింక ఇప్పుడు నామవాచకం కాదు
అది తిరుగుబాటుకు సర్వనామం!!


–డా.పసునూరి రవీందర్
77026 48825

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.

43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad.
Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:mahaapatrika@gmail.com
whatsapp 9247580946



## ఎమ్మెల్యే బెదిరింపు ధోరణి సరికాదు

- **ఏ హాని జరిగినా ఎమ్మెల్యే కూనంనేనిదే బాధ్యత**
- **జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధి కోసం నిర్వహించిన డిపిఆర్ టెండర్లలో అవినీతి జరిగిందని సాక్షాదారులతో సహా నిరూపించినందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బెదిరింపులకు దిగుతున్నాడని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపిఆర్ టెండర్ లో జరుగుతున్న అవినీతిపై తాను ప్రశ్నించినందుకు డిపిఆర్ టెండర్లు రద్దు అయ్యాయని స్పష్టం చేశారు. టెండర్ రద్దు కావడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తనపై వ్యక్తిగతంగా దూషణలకు దిగుతూ తన స్థాయిని దిగజార్చుకున్నారని ఆరోపించారు. ఇకనుంచి వెంటబెడతామని ఊరుకునేది లేదని పరోక్షంగా ఎమ్మెల్యే హత్యా రాజకీయాలను ప్రోత్సహించే అనుమానం కలుగుతోందని అన్నారు. ప్రజాక్షేత్రంలో అవినీతిపై ప్రశ్నిస్తే హత్యా రాజకీయాలు చేస్తామన్న విధంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడడం ఏ విధంగా సమంజసమో నియోజకవర్గ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గతంలో సైతం తనకు వ్యతిరేకంగా మాట్లాడిన కొంతమందిపై సెవెన్ ఇంక్లైన్, ఎయిట్ ఇంక్లైన్, నైన్ ఇంక్లైన్ ఏరియాలలో హత్యలు చేయించినట్లుగా చెప్పుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. కేవలం అవినీతిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తామని హత్యలు చేయిస్తామని బెదిరింపు ధోరణిలో మాట్లాడితే భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అవినీతిపై ప్రశ్నించే హక్కు ప్రతీ ఒక్కరికి ఉంటుందని గుర్తు చేశారు. ఒకవేళ తనకు ఎలాంటి ప్రాణహాని జరిగినా అందుకు పూర్తి బాధ్యత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వహించాల్సి ఉంటుందని చెప్పారు. తాటాకు చప్పుళ్ళకు భయపడి పోరాటాలను మానుకొని ఉంటాం అనుకుంటే అది పొరపాటే అవుతుందని స్పష్టం చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో జరిగే ప్రతీ అవినీతిపై ప్రజాక్షేత్రంలో రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమాలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, భూక్యా శంకర్, సంపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.




## సీతారామ ప్రాజెక్టు పరిశీలనకు సిపిఎం ఉమ్మడి జిల్లా నాయకత్వం

- **సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులపై వాస్తవాలను వెల్లడిస్తాం**
- **అబద్ధాలతో రైతులను మోసం చేస్తున్న మంత్రులు**
- **విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఈనెల 18వ తేదీన సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుల వద్ద సిపిఎం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం పర్యటన ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మంచికంటి భవన్ లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతారామ కాలువ ద్వారా 7.89 లక్షల ఎకరాలకు సాగునీరిస్తామని చెప్పిన మంత్రి తుమ్మల మాటలు మళ్ళీ అవాస్తవంగా మారాయన్నారు. మంత్రుల మాటలు నమ్మి నార్లు పోసిన రైతులకు నిరాశే మిగిలిందని విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేస్తూ మూడు జిల్లాల రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాటాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీతమ్మ సాగర్ బహుళ ప్రయోజనాల ప్రాజెక్టు ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రాజెక్టే లేకుండా నీళ్ళు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 413 చెరువులకు సీతారామ ద్వారా సాగునీరు అందించవచ్చు కానీ ప్రభుత్వం ఆచరణలో విఫలమైందన్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో సమగ్రంగా సాగునీరు అందించే ప్రణాళిక ప్రభుత్వం ముందు పెడతామన్నారు. పాత డిపిఆర్ ప్రకారం కిన్నెరసాని, రోళ్లపాడు,చెరువుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ అశ్వాపురం, బూర్గంపాడు, ములకలపల్లి, పాల్వంచ, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల రైతాంగం 18వ తేదీన జరిగే పర్యటనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కె.బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

- **కాంగ్రెస్ జిల్లా లీడర్ గుత్తా వెంకటేశ్వరరావు**

**కారేపల్లి, మహా:** వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులకు బలైన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా లీడర్ గుత్తా వెంకటేశ్వరరావు అన్నారు. వెంకిట్యా తండాలోని మాజీ ఎంపీపీ దేవులానాయక్ నాయక్ ఇంటివద్ద ఆయన కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. దేవులా కుమారుడు నవీన్ మృతి తనను తీవ్రంగా బాధించిందని అన్నారు. విధినిర్వహణలో బీట్ ఆఫీసర్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నవీన్ కుటుంబానికి అందించే పరిహారం విషయం పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి అన్ని విషయాలు తీసుకెళ్తానని తెలిపారు. ధైర్యంగా ఉండాలని నవీన్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకులు జవ్వాజి శ్రీనివాసరావు ఉన్నారు.

# హక్కుల కోసం మున్నూరుకాపులంతా ఏకం కావాలి

- **రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం పటేల్ పిలుపు**
- **జవహర్ నగర్ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం**

**కుషాయిగూడ, మహా :** మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్ పిలుపునిచ్చారు. కులాల వారీగా జనగణన జరగనున్న నేపథ్యంలో మున్నూరుకాపులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ మేరకు జవహర్ నగర్ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఆయన.. నూతన అధ్యక్షుడు కాశెట్టి మహేందర్ పటేల్, ప్రధాన కార్యదర్శి ఎలుగల మధుసూదన్ పటేల్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది మందితో మొదలైన సంఘం.. 200 మంది క్రియాశీల సభ్యులకు చేరడంపై ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వెల్పుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు మామిండ్ల శ్రీనివాస్, పర్వతనేని సతీశ్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వాసాల వెంకటేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, జవహర్ నగర్ సంఘం ఉపాధ్యక్షులు మంచికంటి శేఖర్ పటేల్, శ్రీకర్ పటేల్, సురేందర్ పటేల్, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.





## బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

- **వర్షా లు సమృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష..**
- **ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి**

**అబ్దుల్లాపూర్మెట్ ఆగస్టు 16 మహా:** ఆదివారం పలు గ్రామాల్లో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో హోరెత్తగా... ఎమ్మెల్యే రాకతో మరింత సందడిగా మారింది. కవాడిపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మల్ రెడ్డి రంగారెడ్డి... అమ్మవారికి పూజలు నిర్వహించారు. పెద్దఅంబర్ పేట్ డివిజన్ పరిధిలోని కుంట్లూరులో పోచమ్మ బోనాలకు హాజరైన ఎమ్మెల్యే... ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అలాగే, తట్టిఅన్నారం హౌజింగ్ బోర్డు కాలనీలో జరిగిన బోనాల్లో పాల్గొన్న మల్ రెడ్డి రంగారెడ్డి... భూగర్భ డ్రైనేజీ, చిల్డ్రన్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మల్ రెడ్డి అమ్మవార్ల ఆశీస్సులు తీసుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని ఆయన ఆకాంక్షించారు.




## ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని 20252026 సంవత్సరం పదోవ తరగతి పరీక్షలో ప్రథమ మరియు ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసిన అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు కంజర్ల శేఖర్ మరియు మహమ్మద్ అలీ పి భార్గవ్ రెడ్డి - 521 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా కంజర్ల శేఖర్ 10.000 రూపాయలు నగదు బహుమతిగా అందజేశారు.టీ త్రిపురాంజలి - 496 మార్కులు సాధించి దిత్వియా స్థానంలో నిలవడంతో. మొహమ్మద్ అలీ 5000 రూపాయలు నగదు బహుమతిగా అందజేశారు, ఈ సందర్భంగా కంజర్ల శేఖర్ మరియు మహమ్మద్ అలీ మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి వారి తల్లితండ్రులు గొప్పగా ఉండే విధంగా వారి భవిషత్తును నిర్మించుకోవాలని సూచించారు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించి, వారి ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ బహుమతులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, హిమాయత్‌నగర్ 3వ వార్డు కౌన్సిలర్ కవితఎల్లేష్ మరియు యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### ముస్లీం మైనారిటీ రిజర్వేషన్లకు 21 ఏళ్లు

## కేక్ కట్ చేసిన షబ్బీర్ అలీ

**ముస్లీం నాయకులతో కలిసి సంబరాలు**

**ఆదిలాబాద్ మహా :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆదిలాబాద్ కు విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ శనివారం పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు షేక్ ముజాయిద్ నివాసాన్ని సందర్శించారు.అక్కడ కాంగ్రెస్ నేతలు, మైనారిటీ నాయకులతో కలిసి విందు భోజనాన్ని స్వీకరించారు. అనంతరం 4 శాతం ముస్లిం రిజర్వేషన్లకు 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రిజర్వేషన్ల వల్ల వేలాది మంది యువత ముస్లీం యువత లబ్ధి పొందుతున్నారన్నారు. అలాగే నీట్ లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెమెంటోలు అందించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు మల్లెపూల నర్సయ్య , డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , జహీర్ రంజానీ , జమియత్ ఉలేమా హింద్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ అబ్దుల్ ఘనీ ఖాస్మీ, జిల్లా అధ్యక్షుడు ఖాజీ సయ్యద్ నదీముద్దీన్, ఇమామ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హాఫీజ్ మంజూర్ అహ్మద్, ఇంతికాబ్ ఆలం, తన్వీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.







## విద్యార్థులకు నగదు బహుమతి అందజేత

**ఏలే చంద్రశేఖర్**

**వలిగొండ ఆగస్టు 16 మహా న్యూస్ :** వలిగొండ మండల పరిధిలోని గోకారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. మార్చి 2026 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యాని విద్యార్థులకు గోకారం గ్రామవాసి ప్రముఖ పారిశ్రామికవేత్త భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ నగదు బహుమతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపుతూ నిరంతరం శ్రమించి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచినచో రాబోయే సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఇదే విధంగా నగదు బహుమతి అందజేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మల్లేష్ దానయ్య రాము కృష్ణ శ్రీశైలం భాషయ్య వినోద్ రెడ్డి తదితరులు, విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మద్యం తాగి వాహనాలు నడపరాదు

**ఎస్సై ఏ. శ్రీకాంత్ రెడ్డి**

**వలిగొండ ఆగష్టు16 మహా న్యూస్:**
వలిగొండ పట్టణ కేంద్రంలో ఆదివారం సాయంత్రం వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలను నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రెండు మోటార్ సైకిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడినట్లైతే పదివేల రూపాయల జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారు. కాబట్టి ప్రజలందరూ చట్టానికి లోబడి నడుచుకుంటూ ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడపవద్దని వాహనదారులకు ఆయన హెచ్చరించారు.




## కల్తీ పెరుగు, కోవా తయారీ కేంద్రంపై ఎస్ఓటీ దాడి

**కల్తీ పెరుగు, కోవ స్వాధీనం**

కుషాయిగూడ, మహా: కాప్రా సర్కిల్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో నందిని మిల్క్ సెంటర్‌లో కల్తీ పెరుగు, కోవా తయారు చేస్తున్న కేంద్రంపై మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా 120 కిలోల కల్తీ పెరుగు, 6 కిలోల కోవాను తరలిస్తున్న రామచందర్‌ను అదుపులోకి తీసుకుని టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఎలాంటి తయారీ, గడువు తేదీలు, లేబుళ్లు లేకుండా పెరుగు, కోవా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఎస్ఓటీ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. తనిఖీల్లో సుమారు వెయ్యి కిలోల పెరుగు, 50 కిలోల కోవా నిల్వ ఉన్నట్లు గుర్తించామన్నారు. పెరుగు, కోవా నమూనాలను ఆహార భద్రతాధికారులకు పంపించామని, పరీక్షల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరుకు చెందిన భూసమల్ల ప్రవీణ (భర్త: వసీం మొహినుద్దీన్) స్మార్ట్ రేషన్ కార్డును అందుకున్నారు.

## జర్నలిస్టులకు రైల్వే పాస్‌ల పునరుద్ధరణ కోసం కృషి చేస్తా

- ఏపీజేఎఫ్ నేతలకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ
- జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఏపీజేఎఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ కృష్ణాంజనేయులు

**గుంటూరు, మహా :** అర్హులైన జర్నలిస్టులకు గతంలో మంజూరు చేసిన విధంగా రైల్వే పాస్‌లు పునరుద్ధరించేలా కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి తగిన విధంగా కృషి చేస్తానని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి శ్రీ పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం (ఏపీజేఎఫ్) ఫౌండర్ ప్రెసిడెంట్ చెవుల కృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆదివారం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రైల్వే పాస్‌లు, ప్రయాణ రాయితీతో పాటు సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం, గుంటూరులో ప్రెస్ క్లబ్ ఏర్పాటు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రయాణించాల్సి ఉంటుందని కృష్ణాంజనేయులు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉన్న విధంగానే, గతంలో రైళ్లలో కూడా జర్నలిస్టులకు 50 శాతం వరకు ప్రయాణ రాయితీతో పాటు ప్రత్యేక రైల్వే పాస్ సౌకర్యం ఉండేదని తెలిపారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టులకు అందుబాటులో ఉన్న రైల్వే పాస్/ప్రయాణ రాయితీ సౌకర్యం నిలిచిపోవడంతో వృత్తిపరమైన విధులు నిర్వహించే జర్నలిస్టులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు.కాబట్టి రాబోయే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఈ అంశాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, అర్హత కలిగిన జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న రైల్వే పాస్ సౌకర్యాన్ని పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఏపీజేఎఫ్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా 60 ఏళ్లు నిండిన లేదా 25 ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, గుంటూరు జిల్లాలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం వంటి అంశాలను కూడా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, రైల్వే పాస్ అంశాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యల కోసం ప్రయత్నిస్తానని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించినట్లు ఏపీజేఎఫ్ నేతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీజేఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెవుల రంగారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్య నాయక్, బొప్పరాజు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, హలీమ్, కె.వి.కె. శర్మ, జహరుల్లా, వీరయ్య, ఎల్ఐసీ వేణుగోపాల్, వెంకట్రావు, రమేష్ పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క సన్నిధిలో సీఎం, రాష్ట్ర మంత్రులతో ఎమ్మెల్యే పాయం

- సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు
- భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా మేడారం అభివృద్ధి
- రహదారులు, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- సీఎం హామీలను మణుగూరులో విలేకరులకు వెల్లడించిన పినపాక ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, మహా:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవతలు సమ్మక్క-సారలమ్మ తల్లుల సన్నిధిలో ఆదివారం ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మేడారం పర్యటన అనంతరం మణుగూరులో ఎమ్మెల్యే పాయం విలేకరులకు పర్యటన వివరాలను వెల్లడించారు. మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి తులాభారంలో సమ్మక్క-సారలమ్మ తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించగా, సీఎంతో పాటు తాను కూడా అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నట్లు పాయం తెలిపారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం మేడారంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను సీఎంతో కలిసి పరిశీలించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహాజాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతుల పనులను ముందుగానే పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

**మేడారం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: పాయం..**

సమ్మక్క-సారలమ్మ మహాజాతర విశిష్టతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాయం తెలిపారు. మేడారం అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని, భక్తులకు అవసరమైన రహదారులు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారం మహా జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేసినట్లు పాయం పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

**సీఎం వెంట మంత్రులు, ప్రజాప్రతినిధులు..**

మేడారం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నట్లు పాయం తెలిపారు. సమ్మక్క-సారలమ్మ తల్లుల ఆశీస్సులతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సీఎం ఆకాంక్షించినట్లు ఎమ్మెల్యే పాయం వెల్లడించారు.

**ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం**

మేడారం పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారని, అనంతరం నూతన ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా మేడారానికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో మేడారంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.









## యంగ్ ఇండియన్ బ్లడ్ డోనార్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# మెగా రక్తదాన శిబిరం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ జాతీయ అధ్యక్షుడు జెబి బాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎందరో రోడ్డు ప్రమాదాలకు గురవుతూ మరికొందరు ఆరోగ్య పరంగా రక్తదానం చేయమని అభ్యర్థించడం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల కోరిక మేరకు రక్త దానం శిబిరం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని పేర్కొన్నారు.రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు సంగం వెంకట పుల్లయ్య, లగడపాటి రమేశ్ చంద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, జిల్లా కార్యదర్శులు రాజేష్, జబ్బు, మొక్కల బాలు పాల్గొన్నారు. త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్, రైల్వే ఎస్ఐ అశోక్ రెడ్డి, డాక్టర్లు నాగరాజు, ప్రవీణ్, అఖిల్ తదితరులు శిబిరాన్ని సందర్శించారు. గ్రీన్ ఎర్త్ సొసైటీ చైర్మన్ రమేష్ రాథోడ్, కోనేరు పూర్ణ చందర్ రావు, కోనేరు సత్యనారాయణ, కార్పొరేటర్ రావి రాంబాబు, రామారావు, భరత్, నిరంజన్ రెడ్డి, రంగనాథ్, ఎస్కే గౌస్ బాషా, ఖలీల్, ప్రసన్న రాయపాటి, చిదిరాల కమల, ఆర్. రమేష్, శ్రీరామ్, ఆసిఫ్, సోయాబ్, అమన్, రఘు, షణ్ముఖ్, శుభాని బాయ్, ధనుష్, జయశ్రీ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



## సాహసానికి సెల్యూట్..
# సేవకు సత్కారం..



- అనుముల నిరంజన్ రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్న కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్..

(కరీంనగర్ మహా)

**ధైర్యం ఆయన అడుగు..**
**కర్తవ్యం ఆయన బాట..**
**ప్రజాసేవ ఆయన లక్ష్యం..**
**అంకితభావం ఆయన బలం..**

దశాబ్దాల పోలీస్ సేవకు ఇప్పుడు జాతీయ గౌరవం దక్కింది.

విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయని ధైర్యం.. పరిస్థితులు ఎన్ని పరీక్షలు పెట్టినా చెక్కుచెదరని నిబద్ధత.. పోలీస్ బాధ్యతను కేవలం ఉద్యోగంగా కాకుండా ప్రజలకు భరోసా ఇచ్చే సేవగా మలిచిన అంకితభావం.. ఇవన్నీ కలిసిన సుదీర్ఘ ప్రస్థానానికి ఇండియన్ పోలీస్ మెడల్ రూపంలో జాతీయ గుర్తింపు లభించింది.

**కానిస్టేబుల్‌గా మొదలైన అడుగు..**
**తీవ్రవాద వ్యతిరేక విధుల్లో పదునెక్కిన ధైర్యం..**
**ఎదురైన సవాళ్లలో మరింత బలపడిన నిబద్ధత..**
**ప్రజాసేవలో మరింత విస్తరించిన బాధ్యత..**
**ఇప్పుడు జాతీయ గౌరవంగా మారిన సేవా ప్రస్థానం..**

**ఇదే కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అనుముల నిరంజన్ రెడ్డి ప్రస్థానం.**

దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోలీస్ శాఖలో కొనసాగుతున్న ఆయన సేవా ప్రస్థానంలో విధి నిర్వహణకు అంకితమైన ఎన్నో అధ్యాయాలు ఉన్నాయి. తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల నుంచి ప్రజా సంక్షేమ కార్యక్రమాల వరకు.. యువతకు అవగాహన కల్పించడం నుంచి డ్రగ్స్, గంజాయి నిర్మూలన వరకు.. నేటి సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయడం నుంచి పోలీస్ సిబ్బందికి శిక్షణ అందించడం వరకు.. ప్రతి దశలో తనదైన ముద్ర వేశారు.

అందుకే ఈ మెడల్ కేవలం ఒక పతకం కాదు..
సాహసానికి దక్కిన సెల్యూట్..
సేవకు లభించిన సత్కారం..
అంకితభావానికి లభించిన గుర్తింపు..

**విధి పట్ల ఆయన చూపిన అచంచల నిబద్ధతకు దక్కిన జాతీయ గౌరవం.**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడంతో అనుముల నిరంజన్ రెడ్డి సేవా ప్రస్థానంలో మరో గర్వకారణమైన అధ్యాయం చేరింది.

**తూటాల మధ్య మొదలైన సేవా ప్రస్థానం**

1989లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన అనుముల నిరంజన్ రెడ్డి కరీంనగర్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసి 1990 జనవరిలో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొలి పోస్టింగ్ పొందారు. తీవ్రవాద ప్రభావం తీవ్రంగా ఉన్న రోజులలోనే ఆయన పోలీస్ సేవా ప్రస్థానం ప్రారంభమైంది.
తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ పలు ఎదురుకాల్పుల్లో విధులు నిర్వహించారు. ఆయన ధైర్యసాహసాలు, పనితీరును గుర్తించిన అప్పటి కరీంనగర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రత్నారెడ్డి తక్కువ సర్వీస్ కాలంలోనే పదోన్నతి కల్పించారు.

**20 మంది మావోయిస్టులు.. వెనుకడుగు వేయని పోలీస్**

1992లో స్వగ్రామమైన వరంగల్ జిల్లాకు వెళ్తున్న సమయంలో సుమారు 20 మంది మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో నిరంజన్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనతో పాటు పనిచేస్తున్న కానిస్టేబుల్ శంకర్ కూడా గాయపడ్డారు.
అయినప్పటికీ ప్రాణభయాన్ని లెక్కచేయకుండా మావోయిస్టులను ఎదుర్కొంటూ ఎదురు కాల్పులు జరిపారు. ఆ ఘటన నుంచి ప్రాణాలతో బయటపడి, అనంతరం కూడా తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో అదే ధైర్యంతో విధులు కొనసాగించారు.
ఆయన సేవలకు గుర్తింపుగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సేవా పతకం, అనంతరం ముఖ్యమంత్రి ఉత్తమ సేవా పతకంతో సత్కరించింది.

**వీర్నపల్లిలో కీలక బాధ్యత**

1994 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తీవ్రవాద ప్రభావం అధికంగా ఉన్న వీర్నపల్లి గ్రామంలో సీఆర్పీఎఫ్‌తో ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంపునకు గైడ్‌గా నిరంజన్ రెడ్డి విధులు నిర్వహించారు. అత్యంత సున్నితమైన పరిస్థితుల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయడంతో పాటు పలు బాంబులు, ఆయుధాల స్వాధీనంలో కీలక పాత్ర పోషించారు.

**న్యాయపోరాటం.. అయినా ఆగని ప్రయాణం**

విధి నిర్వహణలో భాగంగా ఎదుర్కొన్న ఓ ఎన్కౌంటర్ కేసు సుదీర్ఘ న్యాయపరమైన ప్రక్రియకు దారితీసింది. ఏళ్ల తరబడి న్యాయపోరాటాన్ని ఎదుర్కొన్న ఆయన చివరకు నిర్దోషిగా బయటపడ్డారు. ఈ కారణంగా పదోన్నతుల్లో జాప్యం జరిగినప్పటికీ నిరుత్సాహానికి గురికాకుండా సర్వీస్ నిబంధనల ప్రకారం ఎస్ఐగా పదోన్నతి పొంది పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు.

**పోలీసింగ్‌కు ప్రజాసేవను జోడించిన అధికారి**

2013లో గొల్లపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న సమయంలో నిరంజన్ రెడ్డి పోలీస్ విధులతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తూ మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులను ఒకచోట చేర్చి కార్యక్రమాలు నిర్వహించారు. మారుమూల గ్రామాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు భారీ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సుమారు 10 వేల మంది ప్రజలకు 50 నుంచి 70 మంది వైద్యుల సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు, కళ్లద్దాలు అందించారు.

**పోలీస్ అభ్యర్థులకు శిక్షణ.. యువతకు మార్గదర్శనం**

పోలీస్ శాఖలో కొత్తగా నియమితులయ్యే కానిస్టేబుల్ అభ్యర్థులకు ముందస్తు శిక్షణ ఇవ్వడంలోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. ప్రతిరోజూ గ్రౌండ్‌లో శిక్షణ నిర్వహిస్తూ వారిని శారీరకంగా, మానసికంగా సిద్ధం చేశారు.
తదుపరి ఎస్ఐగా వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించి 2023లో సీఐగా పదోన్నతి పొందారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేసిన అనంతరం మెట్పల్లి సీఐగా బాధ్యతలు చేపట్టారు.

**డ్రగ్స్, గంజాయిపై ప్రత్యేక దృష్టి**

మెట్ పల్లి పనిచేసిన సమయంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు కౌన్సెలింగ్, మోటివేషన్ కార్యక్రమాలు చేపట్టి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించారు. గంజాయి అక్రమ రవాణాపై చర్యలు చేపట్టి పలు కేసుల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



**82 క్యాష్ రివార్డులు.. 64 జీఎస్సీలు.. 24 ప్రశంసాపత్రాలు**

సుదీర్ఘ పోలీస్ సేవలో ఆయనకు అనేక గుర్తింపులు లభించాయి. ఇప్పటివరకు 82 క్యాష్ రివార్డులు, 64 జీఎస్సీలు, 24 ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు నిరంజన్ రెడ్డి తెలిపారు.
ఈ సేవల పరంపరకు మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపుగా భారత ప్రభుత్వం 2025 సంవత్సరానికి ఇండియన్ పోలీస్ మెడల్ను ప్రకటించింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అనుముల నిరంజన్ రెడ్డి ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్నారు. దీంతో తూటాల మధ్య ప్రారంభమైన ఆయన పోలీస్ ప్రస్థానం జాతీయ గౌరవంతో మరో కీలక మలుపు తిరిగింది.
ప్రజల సహకారం, ఉన్నతాధికారుల ప్రోత్సాహం, తనతో కలిసి పనిచేసిన పోలీస్ సిబ్బంది కృషి వల్లే ఈ గౌరవం సాధ్యమైందని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. తన సేవా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.
ఒక పతకం ఛాతీపై చేరింది.. కానీ దాని వెనుక దశాబ్దాల విధి నిర్వహణ ఉంది.
ఒక గౌరవం దక్కింది.. కానీ దాని వెనుక ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న జీవితం ఉంది.
ఒక పోలీస్ అధికారి పేరు జాతీయ స్థాయిలో నిలిచింది.. కానీ దాని వెనుక ప్రజల భద్రత కోసం అంకితమైన సుదీర్ఘ సేవ ఉంది.
తీవ్రవాదుల తూటాలను ఎదుర్కొన్న ధైర్యం నుంచి.. ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ వరకు సాగిన అనుముల నిరంజన్ రెడ్డి ప్రస్థానానికి ఇండియన్ పోలీస్ మెడల్ ఒక గౌరవం మాత్రమే కాదు.. పోలీస్ సేవకు అంకితమైన జీవితానికి లభించిన జాతీయ ముద్ర.

**నేటి పోలీసింగ్‌లోనూ అదే అంకితభావం**

ప్రస్తుతం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అనుముల నిరంజన్ రెడ్డి డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన, సీసీటీఎన్ఎస్ అమలు తదితర పోలీస్ శాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు తీవ్రవాదుల తూటాలు సవాలుగా నిలిస్తే.. నేడు సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ మోసాలు పోలీసింగ్‌కు కొత్త సవాళ్లుగా మారాయి. సవాళ్లు మారినా ప్రజల భద్రత పట్ల ఆయన అంకితభావం మాత్రం మారలేదు.

# పన్ను వసూళ్లపై శ్రద్ధ.. ప్రజల భద్రతపై లేదా?

- బెండపూడిలో 'సత్యదేవా రెసిడెన్సీ'పై పలు ప్రశ్నలు
- అనుమతులు, డ్రైనేజీ, పార్కింగ్, ఫైర్ సేఫ్టీపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్




**కాకినాడ, మహా ప్రతినిధి :** కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని 'శ్రీ సత్యదేవా రెసిడెన్సీ, ఫంక్షన్ హాల్ అండ్ రూమ్స్' భవనంపై పలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి స్థానికులు, పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే 2015లో నిర్మించిన ఈ ఐదు అంతస్తుల కమర్షియల్ భవనానికి సంబంధించిన బిల్డింగ్ ప్లాన్, లేఅవుట్ అనుమతుల రికార్డులు తమ వద్ద లేవని పంచాయతీ అధికారులు చెప్పినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే అదే భవనానికి సంబంధించి 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.71,704 హౌస్ ట్యాక్స్ వసూలు చేసిన చలానా పత్రాలు ఉన్నాయని 'మహా పత్రిక' పరిశీలనలో వెల్లడైంది. డోర్ నెంబర్ 1100, అసెస్మెంట్ నెంబర్ 1998580000005లో గొల్లపల్లి సూర్యనారాయణ పేరుతో ఈ పన్ను వసూలైనట్లు పత్రాల్లో ఉంది. అనుమతుల రికార్డులు లేవని చెబుతున్న సమయంలో పన్ను మాత్రం ఎలా వసూలు చేశారన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**భక్తుల రద్దీ ప్రాంతంలో పార్కింగ్ ఎక్కడ?***

అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం వేలాది మంది భక్తులు, పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రూములు, వసతి కోసం వచ్చే పర్యాటకుల రద్దీ ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో ఉన్న భారీ కమర్షియల్ భవనానికి సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీ గదులకు రోజుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు వసూలు చేస్తున్నప్పటికీ.. తమ వాహనాలను నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం లేకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఫంక్షన్ హాల్‌కు వచ్చే వారు, రూములు తీసుకునే పర్యాటకులు తమ వాహనాలను ప్రధాన రహదారి పక్కనే నిలిపివేయాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పడుతున్నాయని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు.

**ప్రభుత్వ డ్రైనేజీపై స్లాబ్?**

భవనం ముందు వైపు ఉన్న ప్రభుత్వ మురుగు కాలువను మూసివేసి దానిపై స్లాబ్ ఏర్పాటు చేశారన్నది స్థానికుల ప్రధాన ఆరోపణ. దీంతో మురుగు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి, కాలనీ పరిసరాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు. డ్రైనేజీ సక్రమంగా ప్రవహించక మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని వారు చెబుతున్నారు.

**టౌన్ ప్లానింగ్ నిబంధనలు అమలయ్యాయా?**

ఇంత పెద్ద కమర్షియల్ భవనానికి అవసరమైన పార్కింగ్ సదుపాయం ఉందా? గ్రౌండ్ ఫ్లోర్‌ను ఏ విధంగా వినియోగిస్తున్నారు? నిర్మాణానికి ముందు బిల్డింగ్ ప్లాన్, లేఅవుట్ అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పార్కింగ్‌కు తగిన స్థలం లేకపోవడం వల్ల రోడ్డుపైనే వాహనాలు నిలుస్తుండటంతో సాధారణ ప్రయాణికులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**ఫైర్ సేఫ్టీపై ప్రశ్నలు**

ఫంక్షన్ హాల్‌లో వందలాది మంది ఒకేసారి చేరే అవకాశం ఉండటంతో అగ్నిమాపక భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవనం వెనుక వంటల కోసం కిచెన్ షెడ్ కూడా ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌కు ఫైర్ సేఫ్టీ ఎన్‌ఓసీ ఉందా? లేదా? అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. ఏదైనా అగ్ని ప్రమాదం లేదా ఇతర ప్రమాదం జరిగితే ప్రజల భద్రత కోసం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకున్నారనే దానిపై కూడా సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**సంయుక్త విచారణకు డిమాండ్**

ఏళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారంపై కేవలం ఒక శాఖతో కాకుండా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఫైర్ సర్వీసెస్, గ్రామ పంచాయతీ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని బెండపూడి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులు, పన్ను అసెస్మెంట్, ప్రభుత్వ డ్రైనేజీ స్థితి, పార్కింగ్ సదుపాయం, ఫైర్ సేఫ్టీ అనుమతులు తదితర అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులను స్థానికులు కోరుతున్నారు.

**పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. ప్రజల భద్రతపై లేదా?**

ఒకవైపు భవన అనుమతులకు సంబంధించిన రికార్డులు లేవని అధికారులు చెబుతుండగా.. మరోవైపు అదే భవనానికి రూ.71,704 పన్ను వసూలైన పత్రాలు ఉండటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు అన్నవరం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు, పర్యాటకులు వచ్చే ప్రాంతంలో భారీ కమర్షియల్ భవనానికి పార్కింగ్ సదుపాయం లేకపోవడం, డ్రైనేజీ సమస్యలు, ఫైర్ సేఫ్టీపై స్పష్టత లేకపోవడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పన్ను వసూలు చేసే సమయంలో కనిపించిన భవనం.. నిబంధనల తనిఖీ సమయంలో ఎందుకు కనిపించలేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

# సింగరేణి చెంత 'విష' జలాలు.. మూగజీవాలకు మృత్యుఘంటిక..?

- సమితిసింగారంలో ఒకేసారి 18 మేకలు మృతి
- ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్ వ్యర్థ జలాలే కారణమని బాధిత రైతు ఆరోపణ
- గతంలోనూ మేకలు, గేదెలు మృత్యువాత పడ్డాయంటున్న స్థానికులు
- 3ప్రైవేటు సంస్థలపై సింగరేణి పర్యవేక్షణ ఎక్కడ..?: నాయకుల ప్రశ్న
- మూగజీవాల మరణాలకు కారణమేంటో తేల్చాలంటూ డిమాండ్



**మణుగూరు, మహా :** సింగరేణి పరిసరాల్లో పారిశ్రామిక వ్యర్థ జలాలు మూగజీవాల పాలిట మృత్యుఘంటికగా మారుతున్నాయా..? ప్రైవేటు సంస్థల కార్యకలాపాలపై పర్యవేక్షణ కొరవడిందా..? మణుగూరు సమితిసింగారం ప్రాంతంలో ఆదివారం ఒకేసారి 18 మేకలు మృత్యువాత పడిన ఘటన ఈ ప్రశ్నలను మరోసారి తెరపైకి తెచ్చింది. ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్ సమీపంలో మేతకు వెళ్లిన మేకలు అక్కడ నిల్వ ఉన్న కలుషిత నీటిని తాగిన అనంతరం మృతి చెందాయని బాధిత రైతు రాములు ఆరోపిస్తున్నారు. అయితే మేకల మృతికి కచ్చితమైన కారణం ఏమిటన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాములుకు చెందిన మేకల మంద ఆదివారం ఎప్పటిలాగే మేత కోసం ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్ పరిసర ప్రాంతాలకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అక్కడ ప్రవహిస్తున్న లేదా నిల్వ ఉన్న నీటిని తాగిన తర్వాత కొద్దిసేపటికే మేకలు అస్వస్థతకు గురై ఒక్కొక్కటిగా మృతి చెందినట్లు రైతు ఆరోపిస్తున్నారు. 18 మేకలు ఒకేసారి మృతి చెందడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.

**గతంలోనూ మూగజీవాల మృతి..!**

ఇదే ప్రాంతంలో గతంలోనూ మేకలు, గేదెలు మృతి చెందిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పారిశ్రామిక ప్రక్రియలో వెలువడే వ్యర్థ జలాలను నిబంధనల మేరకు శుద్ధి చేసి సురక్షితంగా నిర్వహించాల్సి ఉండగా, అవి బయటకు వచ్చి సమీప ప్రాంతాలు, వాగుల్లో కలుస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఒకేసారి 18 మేకలు మృత్యువాత పడటంతో ఆ నీటిలో ఏముంది..? మేకల మృతికి అదే కారణమా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మృతిచెందిన మేకలకు పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి, ఘటనాస్థలంలోని నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపితేనే అసలు కారణం బయటపడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఓబీ పనుల్లోనూ భద్రతపై ఆరోపణలు**

మణుగూరు ఏరియా సింగరేణిలో ఆఫ్‌లోడింగ్, ఓబీ పనులు నిర్వహిస్తున్న ప్రైవేటు కాంట్రాక్టర్ల పనితీరుపైనా కొంతకాలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓబీ కంపెనీలు వినియోగించే కొన్ని వాహనాల సామర్థ్యం, ఫిట్‌నెస్, నిర్వహణపై కార్మిక వర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. కార్మికుల భద్రతతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, పశువులు, పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ కాంట్రాక్టు సంస్థలపై సింగరేణి యాజమాన్యం కఠిన పర్యవేక్షణ పెట్టాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

**నీటి నమూనాలు పరీక్షిస్తేనే నిజం తేలేది..!**

18 మేకల మృతికి ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్ నుంచి వెలువడినట్లు ఆరోపిస్తున్న వ్యర్థ జలాలే కారణమా..? మరేదైనా కారణముందా..? అన్నది శాస్త్రీయ పరీక్షల్లో తేలాల్సి ఉంది. మృతిచెందిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించడంతో పాటు ఘటనాస్థలంలోని నీరు, మట్టి నమూనాలను సేకరించి గుర్తింపు పొందిన ప్రయోగశాలకు పంపించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సింగరేణి, పశుసంవర్ధక, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. 18 మూగజీవాలు ఒకేసారి మృత్యువాత పడిన ఘటనపై అధికారులు ఏం తేలుస్తారు..? వ్యర్థ జలాలపై పరీక్షలు నిర్వహిస్తారా..? బాధిత రైతుకు నష్టపరిహారం అందిస్తారా..? భవిష్యత్తులో మరో మూగజీవం బలికాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటారా..? అన్నది ఇప్పుడు వేచి చూడాల్సిందే.

**పర్యవేక్షణ లేకనే ప్రైవేటు సంస్థల ఇష్టారాజ్యం**
**- ఏఐటీయూసీ రాంగోపాల్**



సింగరేణి అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ప్రైవేటు సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ నాయకుడు రాంగోపాల్ ఆరోపించారు. ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్ నిర్వహణలో భద్రత, పర్యావరణ ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఒకేసారి 18 మేకలు చనిపోవడాన్ని సాధారణ ఘటనగా తీసుకోకూడదు. ప్లాంట్ నుంచి బయటకు వస్తున్న నీరు, రసాయన వ్యర్థాలపై వెంటనే శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలి. మూగజీవాల మృతికి వ్యర్థ జలాలే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధిత రైతుకు పూర్తి నష్టపరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

**వ్యర్థ రసాయనాలను వాగుల్లోకి వదిలేస్తే చూస్తూ ఊరుకోం**
**- సీపీఐ నాయకుడు దుగ్యాల సుధాకర్**



మణుగూరు సింగరేణి ప్రాంతంలోని ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న వ్యర్థ రసాయనాలను వాగుల్లోకి వదులుతున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ నాయకుడు దుగ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. గతంలోనూ ఈ ప్రాంతంలో మూగజీవాలు మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం ఆందోళనకరమన్నారు. గత ఘటనల నుంచి అధికారులు పాఠాలు నేర్చుకుని ఉంటే ఇప్పుడు 18 మేకలు మృతి చెందే పరిస్థితి వచ్చేదా అన్నది ఆలోచించాలి. వ్యర్థ జలాలు వాగులు, పశువులు సంచరించే ప్రాంతాల్లోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. రైతులు, పశువుల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సుధాకర్ పేర్కొన్నారు.

# ఎల్‌పీజీ కొరతకు కేంద్రం కళ్లెం

**ఢిల్లీ, మహా:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, సముద్ర మార్గాల్లో ఎల్‌పీజీ దిగుమతులకు ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో దేశీయ వంటగ్యాస్ సరఫరాలో కొరత రాకుండా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తొలిసారిగా ప్రభుత్వ, ప్రైవేటు రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ సంస్థలకు సంస్థల వారీగా గరిష్ఠ ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆగస్టు 13న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ సంస్థలకు కలిపి రోజుకు 63,810 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేటాయించారు. దిగుమతుల్లో అంతరాయం ఏర్పడినప్పుడు దేశీయ ఉత్పత్తిని పెంచి సరఫరా లోటును భర్తీ చేయడమే లక్ష్యం. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అత్యధికంగా రోజుకు 18,000 టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించారు. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిఫైనరీ ఈ ఉత్పత్తిని అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగంలోని 18 రిఫైనరీలకు కలిపి రోజుకు 31,470 టన్నుల లక్ష్యం పెట్టారు. బీపీసీఎల్ కొచ్చి రిఫైనరీకి 4,800 టన్నులు, నయారా ఎనర్జీ వదినార్ రిఫైనరీకి 4,480 టన్నుల లక్ష్యాన్ని కేటాయించారు.రిఫైనరీలతో పాటు సహజ వాయువు నుంచి ఎల్‌పీజీ ఉత్పత్తి చేసే ఓఎన్‌జీసీ, గెయిల్ వంటి అప్‌స్ట్రీమ్ సంస్థలకూ రోజుకు 6,460 టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు. అత్యవసర సమయంలో సహజ వాయువు ఆధారిత ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా పూర్తిగా వినియోగించుకునేలా ఈ వ్యవస్థను రూపొందించారు.ప్రస్తుతం భారత్ వంటగ్యాస్ అవసరాల్లో కొంత భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. ముఖ్యంగా మధ్య ప్రాచ్యం నుంచి వచ్చే సరఫరాపై భౌగోళిక రాజకీయ పరిణామాలు ప్రభావం చూపే అవకాశం ఉంది. దిగుమతులు తగ్గిన సందర్భంలో దేశీయ ఉత్పత్తిని పెంచి వినియోగదారులకు నిరంతర సరఫరా అందించేందుకు తాజా విధానం ఉపయోగపడనుంది.ఎల్‌పీజీ నిల్వ, రవాణా మౌలిక వసతులను బలోపేతం చేయాలని కూడా కేంద్రం ఆదేశించింది. అవసరమైనప్పుడు ఒక ప్రాంతంలో అందుబాటులో ఉన్న ఎల్‌పీజీని మరో ప్రాంతానికి వేగంగా తరలించేలా వ్యవస్థను సిద్ధం చేయనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నిర్దిష్ట పరిమాణంలో, నిర్దిష్ట కాలానికి ఉత్పత్తిని పెంచాలని సంస్థలను ఆదేశించే అధికారం కేంద్రానికి ఉంటుంది. సరఫరా సమానంగా కొనసాగించడం, వినియోగదారులకు సరసమైన ధరల్లో ఎల్‌పీజీ అందించడం కూడా ఈ విధానంలోని ముఖ్య లక్ష్యాలు.ఈ ఉత్పత్తి లక్ష్యాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమీక్షించనున్నారు. కొత్త రిఫైనరీలు, పెరుగుతున్న ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక వసతుల అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని జనవరి 1, జూలై 1 తేదీల్లో షెడ్యూల్‌ను పునఃసమీక్షించే విధానం ప్రతిపాదించారు.

# హసీనా అప్పగింతపై ఢాకా పట్టు

- అప్పటివరకు తారిఖ్ రెహ్మాన్ భారత్‌కు రారు!
- 'అనుకూల వాతావరణం' ఏర్పడాలి.
- భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు షేక్ హసీనా అంశమే ప్రధాన అడ్డంకి.

**ఢాకా, మహా:** భారత్‌బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాల్లో మరోసారి ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు అప్పగించే విషయంలో స్పష్టమైన పురోగతి కనిపించే వరకు ప్రధాని తారిఖ్ రెహ్మాన్ భారత్ పర్యటనకు వెళ్లే పరిస్థితి లేదని ఢాకా సంకేతాలిచ్చింది. భారత్‌లో తారిఖ్ రెహ్మాన్ పర్యటనకు 'ప్రాపిషియస్ ఎన్విరాన్‌మెంట్' (అనుకూలమైన వాతావరణం) ఏర్పడాల్సి ఉందని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఎ.కె.ఎం. షాహిదుల్ కరీమ్ స్పష్టం చేశారు. హసీనా అప్పగింతపై భారత్ వేగంగా నిర్ణయం తీసుకోవాలని ఢాకా కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు. తారిఖ్ రెహ్మాన్ భారత్ పర్యటనపై ఇరు దేశాల మధ్య గత కొన్ని వారాలుగా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు పర్యటనకు అనుకూలంగా లేవని బంగ్లాదేశ్ భావిస్తోంది. హసీనా అప్పగింతతో పాటు బంగ్లాదేశ్ కోరుతున్న ఇతర పరారీలో ఉన్న నిందితుల అంశాల్లో కూడా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని ఢాకా చెబుతోంది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ప్రకారం, ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లాలంటే పరస్పర విశ్వాసాన్ని పెంచే వాతావరణం అవసరం. 2024 ఆగస్టులో విద్యార్థుల నేతృత్వంలో జరిగిన భారీ ఉద్యమం, హింసాత్మక పరిణామాల నేపథ్యంలో అప్పటి ప్రధాని షేక్ హసీనా అధికారాన్ని కోల్పోయి బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. అప్పటి నుంచి ఆమె భారత్‌లోనే ఉంటున్నారు. ఆమె పాలనలో విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసే క్రమంలో జరిగిన హింసకు సంబంధించి బంగ్లాదేశ్‌లోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఆమెను గైర్హాజరులో దోషిగా తేల్చి మరణశిక్ష విధించింది. అయితే హసీనా ఈ కేసును రాజకీయ ప్రేరేపిత చర్యగా ఖండిస్తున్నారు. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికే భారత్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేసింది. ఆ విజ్ఞప్తిని భారత ప్రభుత్వం తన చట్టపరమైన ప్రక్రియ, సంబంధిత నిబంధనల ప్రకారం పరిశీలిస్తోందని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దీంతో అప్పగింత అంశం రెండు దేశాల మధ్య అత్యంత సున్నితమైన దౌత్య అంశంగా కొనసాగుతోంది. ఇటీవల న్యూఢిల్లీలో హసీనా మీడియాతో మాట్లాడటం ఢాకా ఆగ్రహానికి మరో కారణమైంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ముందుగానే భారత్‌కు తన అభ్యంతరాలను తెలియజేసినప్పటికీ ఆ కార్యక్రమం జరగడం తీవ్ర అసంతృప్తికి కారణమైందని ఢాకా పేర్కొంది. భారత్‌లో ఉంటూ హసీనా చేస్తున్న రాజకీయ వ్యాఖ్యలు బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాలు, సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశాల్లో జోక్యంగా కనిపిస్తున్నాయని బంగ్లాదేశ్ అభిప్రాయపడుతోంది. ఆమె వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావాలన్న ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయని ఢాకా ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ తన విదేశాంగ విధానంలో 'బంగ్లాదేశ్ ఫస్ట్' విధానాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేస్తోంది. సార్వభౌమాధికారం, పరస్పర గౌరవం ఆధారంగా భారత్‌తో సంబంధాలను కొనసాగించాలన్నదే తమ ఉద్దేశమని ఢాకా చెబుతోంది. అయితే హసీనా అంశంలో భారత్ నుంచి సానుకూల స్పందన లేకుండా సంబంధాలను పూర్తిగా సాధారణ స్థితికి తీసుకురావడం కష్టమనే సంకేతాలను మాత్రం ఇస్తోంది. తారిఖ్ రెహ్మాన్ 2026 ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్‌తో సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ, తన తొలి విదేశీ పర్యటనల్లో భారత్‌కు బదులుగా మలేషియా, చైనాలను ఎంచుకున్నారు. జూన్ 22న ఆయన మలేషియాలో అధికారిక పర్యటన చేశారు. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇరు దేశాలు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం, ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని పేర్కొన్నాయి. అయితే భారత్ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. భౌగోళిక సమీపత, సరిహద్దు భద్రత, వాణిజ్యం, రవాణా అనుసంధానం, నదీజలాలు, ఇంధనం వంటి అనేక కీలక అంశాల కారణంగా ఢాకాన్యూఢిల్లీ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అందువల్ల తారిఖ్ రెహ్మాన్ భారత్ పర్యటన కేవలం ఒక సాధారణ ద్వైపాక్షిక పర్యటన కాకుండా, రెండు దేశాల మధ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టే కీలక రాజకీయ సంకేతంగా మారే అవకాశం ఉంది. ఇటీవల భారత్‌బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన సంప్రదింపులు పెరిగాయి.

# బీసీసీఐలో కీలక మార్పులు

- వీవీఎస్ లక్ష్మణ్‌కు బాధ్యతలు!
- సెప్టెంబరు నుంచి 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' రోల్?
- గంభీర్, అగార్కర్, జట్టు మధ్య సమన్వయానికి కొత్త వ్యవస్థ



**ముంబై, మహా :** భారత క్రికెట్ వ్యవస్థలో కీలక మార్పులకు బీసీసీఐ సిద్ధమవుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. సెప్టెంబరు నుంచి మాజీ టీమిండియా దిగ్గజం వీవీఎస్ లక్ష్మణ్‌కు మరింత విస్తృతమైన బాధ్యతలు అప్పగించే యోచనలో బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (గతంలో ఎన్‌సీఏ)కు హెడ్‌గా వ్యవహరిస్తున్న లక్ష్మణ్‌ను కొత్తగా 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' తరహా పాత్రలో తీసుకురావాలని బీసీసీఐ పరిశీలిస్తున్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ మార్పు ద్వారా జాతీయ జట్టు, కోచింగ్ సిబ్బంది, సెలక్షన్ కమిటీ, ఆటగాళ్ల అభివృద్ధి వ్యవస్థ మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది.

**లక్ష్మణ్ చేతిలో కీలక సమన్వయ బాధ్యతలు?**

ప్రతిపాదిత కొత్త వ్యవస్థలో లక్ష్మణ్ పాత్ర కేవలం యువ క్రికెటర్ల అభివృద్ధి లేదా గాయాల నుంచి కోలుకుంటున్న ఆటగాళ్ల పర్యవేక్షణకు పరిమితం కాకుండా విస్తరించే అవకాశం ఉంది. జాతీయ జట్టు మేనేజ్‌మెంట్, సెలక్షన్ కమిటీ, బీసీసీఐ నాయకత్వం మధ్య సమాచార మార్పిడి, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆటగాళ్ల అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన కీలకంగా వ్యవహరించనున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ముఖ్యంగా భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో లక్ష్మణ్ సమన్వయంగా పనిచేసేలా వ్యవస్థను రూపొందించే అవకాశం ఉందని సమాచారం. జట్టు ఎంపిక, ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభారం, భవిష్యత్ ప్రణాళికలు వంటి కీలక అంశాల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడేలా ఈ కొత్త బాధ్యతలు ఉపయోగపడతాయని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**గంభీర్ దూకుడు.. లక్ష్మణ్ ప్రశాంత శైలి!**

భారత జట్టు వ్యవహారాల్లో లక్ష్మణ్ ప్రవేశం మరో కోణంలోనూ ఆసక్తిని రేపుతోంది. గౌతమ్ గంభీర్ దూకుడైన, స్పష్టమైన నిర్ణయాల శైలికి భిన్నంగా లక్ష్మణ్ ప్రశాంతమైన, సమతుల్యమైన వ్యవహారశైలికి పేరున్న వ్యక్తి. సీనియర్ ఆటగాళ్లతో పాటు యువ క్రికెటర్లతోనూ ఆయనకు మంచి అనుబంధం ఉంది. అందుకే డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్ల మధ్య సమన్వయం, కోచ్‌లు-సెలక్టర్ల మధ్య సమాచార మార్పిడి, ఆటగాళ్ల అభిప్రాయాలను బీసీసీఐకి చేరవేయడంలో లక్ష్మణ్ కీలక 'బ్రిడ్జ్'గా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**సెలక్షన్ కమిటీ–జట్టు మధ్య గ్యాప్ తగ్గించడమే లక్ష్యం?**

ఇటీవలి కాలంలో ఆటగాళ్ల ఎంపిక, ఫిట్‌నెస్, పనిభారం, గాయాల నిర్వహణ వంటి అంశాలపై జట్టు మేనేజ్‌మెంట్, సెలక్షన్ వ్యవస్థ మధ్య సమన్వయం గురించి చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వ్యవస్థలో ఆటగాళ్ల ఫిట్‌నెస్ నిర్వహణపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. అజిత్ అగార్కర్, లక్ష్మణ్ నేతృత్వంలోని CoE అధికారుల మధ్య ఆటగాళ్ల గాయాల నిర్వహణపై ఇటీవల వర్చువల్ సమావేశం జరిగినట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగింది.

ఈ నేపథ్యంలో కొత్త బాధ్యతలు లక్ష్మణ్‌కు అప్పగిస్తే సెలక్షన్, ఫిట్‌నెస్, కోచింగ్, ఆటగాళ్ల అభివృద్ధి వ్యవస్థల మధ్య మరింత స్పష్టమైన సమన్వయం సాధించాలన్నదే బీసీసీఐ ఉద్దేశంగా కనిపిస్తోంది.

**CoEకి లక్ష్మణ్ ఇప్పటికే కీలక బలం**

లక్ష్మణ్ ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. యువ ఆటగాళ్ల అభివృద్ధి, జాతీయ జట్టుకు అవసరమైన ప్రతిభను తయారు చేయడం, గాయపడిన ఆటగాళ్ల ఫిట్‌నెస్ ప్రక్రియ, శిక్షణ ప్రమాణాల పర్యవేక్షణలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.ఇటీవలే CoEను కేవలం గాయపడిన ఆటగాళ్ల 'రిహాబిలిటేషన్ సెంటర్'గా చూడకూడదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. జాతీయ జట్టు సపోర్ట్ స్టాఫ్ నిర్ణయించిన ఫిట్‌నెస్, కండిషనింగ్ ప్రోటోకాల్స్‌ను ఆటగాళ్లు పాటించేలా చూడటం కూడా CoE బాధ్యతల్లో భాగమని ఆయన వివరించారు.

**జింబాబ్వే సిరీస్, ఆసియా క్రీడల్లోనూ లక్ష్మణ్ సేవలు**

2026లో భారత క్రికెట్ షెడ్యూల్ విపరీతంగా బిజీగా ఉండటంతో లక్ష్మణ్ పాత్ర ఇప్పటికే విస్తరించింది. జాతీయ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మరో సిరీస్‌తో బిజీగా ఉన్న సమయంలో జింబాబ్వే పర్యటన, ఆసియా క్రీడల కోసం భారత జట్టుకు లక్ష్మణ్ కోచింగ్ బాధ్యతలు చేపట్టినట్లు నివేదికలు వచ్చాయి. ఒకేసారి వేర్వేరు జట్లు అంతర్జాతీయ బాధ్యతల్లో ఉండాల్సి వచ్చినప్పుడు బీసీసీఐ గతంలోనూ ఇలాంటి 'స్ప్లిట్ కోచింగ్' విధానాన్ని ఉపయోగించింది.

ఈ అనుభవం కూడా లక్ష్మణ్‌ను మరింత విస్తృతమైన క్రికెట్ పరిపాలనా బాధ్యతలకు ఎంపిక చేయడానికి కారణంగా మారినట్లు తెలుస్తోంది.

**ఇది గంభీర్‌కు ప్రత్యామ్నాయమా?**

లక్ష్మణ్‌కు కొత్త బాధ్యతలు అప్పగించాలన్న వార్తల నేపథ్యంలో ఆయనను గౌతమ్ గంభీర్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకురాబోతున్నారా? అన్న చర్చ కూడా మొదలైంది. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న నివేదికలు లక్ష్మణ్‌ను ప్రధాన కోచ్‌గా నియమించడంపై కాకుండా కోచ్, సెలక్టర్లు, ఆటగాళ్లు, బోర్డు మధ్య సమన్వయం చేసే ఉన్నత స్థాయి పాత్ర గురించి చెబుతున్నాయి. గతంలోనూ లక్ష్మణ్ భారత జట్టు ప్రధాన కోచ్ పదవిపై ఆసక్తి చూపలేదని వార్తలు వచ్చాయి.

**2026 ద్వితీయార్థంలో బిజీ షెడ్యూల్.. ముందస్తు ప్లాన్**

2026 ద్వితీయార్థంలో భారత జట్టుకు వరుసగా ద్వైపాక్షిక సిరీస్‌లు, బహుళ జట్ల టోర్నీలు, ఆసియా క్రీడల వంటి బాధ్యతలు ఉండటంతో ఆటగాళ్ల నిర్వహణ అత్యంత కీలకంగా మారనుంది. ఒకే సమయంలో పలువురు ఆటగాళ్ల పనిభారం, ఫిట్‌నెస్, రొటేషన్, జట్టు ఎంపిక వంటి అంశాలను సమన్వయం చేయాల్సి ఉంటుంది.ఈ పరిస్థితుల్లో నిర్ణయాలు ఆలస్యం కాకుండా, కోచ్-సెలక్షన్ కమిటీ, బీసీసీఐ మధ్య ఒకే విధమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని బోర్డు భావిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి

**భారత క్రికెట్‌లో కొత్త పవర్ సెంటర్‌గా లక్ష్మణ్?**

వీవీఎస్ లక్ష్మణ్‌కు ప్రతిపాదిస్తున్న కొత్త బాధ్యతలు అమల్లోకి వస్తే భారత క్రికెట్ పరిపాలనలో ఆయన ప్రాధాన్యం గణనీయంగా పెరగనుంది. ఆటగాళ్ల అభివృద్ధి నుంచి జాతీయ జట్టు వ్యూహాత్మక ప్రణాళికల వరకు ఆయన పాత్ర విస్తరించే అవకాశం ఉంది. అయితే ఈ వ్యవస్థలో గంభీర్ ప్రధాన కోచ్, అగార్కర్ చీఫ్ సెలక్టర్‌గా తమ తమ అధికారిక బాధ్యతలను కొనసాగిస్తారు. లక్ష్మణ్ పాత్ర ప్రధానంగా సమన్వయం, దీర్ఘకాలిక క్రికెట్ ప్రణాళిక, ఆటగాళ్ల అభివృద్ధి చుట్టూ ఉండే అవకాశం ఉంది.



# 'ఇరుముడి'పై అంచనాలు పెంచుతున్న ట్రైలర్

మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, మెలోడీ, ఎనర్జిటిక్ సాంగ్స్ సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేయగా.. తాజాగా విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ అంచనాలను మరింత పెంచింది.
ఈ నేపథ్యంలో 'ఇరుముడి'లోని మోస్ట్ అవైటెడ్ సాంగ్ 'మల్లెపూల పల్లకి'ని మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విడుదల చేశారు. అయ్యప్ప భక్తుల్లో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉన్న ఈ పాటకు ఒరిజినల్ భక్తి భావాన్ని కొనసాగిస్తూనే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ కొత్త మ్యూజికల్ టచ్ ఇచ్చారు. గ్రాండ్ ఆర్కెస్ట్రేషన్, పవర్‌ఫుల్ రిథమ్స్‌తో పాటను మరింత ఎనర్జిటిక్‌గా తీర్చిదిద్దారు.
ఈ పాట గురించి దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'మల్లెపూల పల్లకి' కోసం చాలా శ్రమించామని తెలిపారు. ఒరిజినల్ కంపోజర్స్, సింగర్స్‌ను పిలిపించి వారితోనే ఈ పాటను చేయించినట్లు చెప్పారు. ఈ పాట థియేటర్‌లో తాండవంలా ఉంటుందని పేర్కొన్నారు. 'ఇరుముడి' తన గత చిత్రాల మాదిరిగా లైట్ హార్టెడ్‌గా ఉండదని శివ నిర్వాణ స్పష్టం చేశారు. ఇది చాలా సీరియస్, ఇంటెన్స్ ఫ్యామిలీ డ్రామా అని తెలిపారు. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు ప్రేక్షకులను అత్యంత ఉత్కంఠభరితమైన డ్రామాలోకి తీసుకెళ్తాయని చెప్పారు. తెలుగు సినిమాల్లో వచ్చిన మోస్ట్ ఇంటెన్స్ అండ్ సీరియస్ ఫ్యామిలీ డ్రామాల్లో 'ఇరుముడి' ఒకటిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రవితేజతో పనిచేయడం గర్వంగా ఉందని శివ నిర్వాణ అన్నారు. ఆయన అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులకు మరోసారి చూడాలనిపించేలా ఉంటుందని తెలిపారు. సీలేరు ప్రాంతంలోని రియల్ లొకేషన్స్‌లో సినిమాను తెరకెక్కించినట్లు చెప్పారు. రవితేజతో పాటు ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు తమ పాత్రల్లో అద్భుతంగా నటించారని ప్రశంసించారు.ముఖ్యంగా రవితేజ, నక్షత్ర మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయని శివ నిర్వాణ పేర్కొన్నారు. నక్షత్ర పెర్ఫార్మెన్స్ చూస్తే కన్నీళ్లు వచ్చేంతగా ఉంటుందని అన్నారు. ప్రియా భవానీ శంకర్‌కు సినిమాలో మూడు కీలక సన్నివేశాలు ఉన్నాయని, అవి థియేటర్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయని చెప్పారు.జీవీ ప్రకాష్ కుమార్ సంగీతంపై కూడా శివ నిర్వాణ ప్రశంసలు కురిపించారు. తాను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచే ఆయన సంగీతాన్ని ఇష్టపడుతున్నానని, 'ఇరుముడి'కి జీవీ ప్రకాష్ అద్భుతమైన సంగీతాన్ని అందించారని తెలిపారు. సినిమాటోగ్రాఫర్ విష్ణు శర్మ తనకు రైట్ హ్యాండ్‌లా పనిచేశారని, సినిమా చూసిన తర్వాత ఆయన సినిమాటోగ్రఫీ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారని శివ నిర్వాణ అన్నారుమొత్తంగా 'ఇరుముడి' కేవలం ఫ్యామిలీ డ్రామా మాత్రమే కాదని.. ప్రేక్షకులకు బలమైన ఎమోషనల్ ఎక్స్‌పీరియన్స్‌తో పాటు మంచి మెసేజ్‌ను అందించే సినిమా అని దర్శకుడు శివ నిర్వాణ వెల్లడించారు. ఆగస్టు 21న ఈ సినిమా థియేటర్లలోకి రానుండటంతో రవితేజ అభిమానుల్లోనూ, సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది.

# స్క్రిప్ట్ విషయంలో రాజీపడను: యశ్

రాకింగ్ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 'కేజీఎఫ్' తర్వాత ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా యశ్ తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.టీవీ సీరియల్స్‌లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకున్న సమయంలో తనకు ఏడు సినిమాల్లో అవకాశాలు వచ్చాయని యశ్ తెలిపారు. అయితే ప్రతి సినిమాకీ ముందుగా స్క్రిప్ట్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు చెప్పారు. స్క్రిప్ట్ నచ్చకపోతే ఆ పాత్రను తాను ఆస్వాదించలేనని, ప్రేక్షకులకు కూడా నచ్చేలా చేయలేనని పేర్కొన్నారు. ఈ విషయంలో రాజీపడకపోవడంతో ఆ ఏడు సినిమాల అవకాశాలు కోల్పోయినా ఎప్పుడూ బాధపడలేదన్నారు. పారితోషికం విషయంలోనూ తనది భిన్నమైన విధానమని యశ్ తెలిపారు. తన మార్కెట్ వ్యాల్యూకు అనుగుణంగా పారితోషికం తీసుకుంటానని, అయితే నిర్మాత భారీ మొత్తాన్ని ముందుగానే చెల్లించి రిస్క్ మొత్తం భరించే విధానం తనకు ఇష్టం ఉండదన్నారు. నిర్మాత ఎంత రిస్క్ తీసుకుంటే తానూ అంతే రిస్క్ తీసుకోవాలనేది తన సిద్ధాంతమని చెప్పారు. సినిమా విజయవంతమైతే లాభాల్లో వాటా ఉండాలని, నష్టాలు వస్తే వాటిని కూడా కలిసి భరించాలనుకుంటానన్నారు. 'కేజీఎఫ్' విజయంపై స్పందిస్తూ.. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ ప్రేక్షకులు సినిమాను ఎంతో ఆదరించారని యశ్ గుర్తుచేసుకున్నారు. ప్రేక్షకుల నమ్మకమే తనకు అతి పెద్ద బలమని చెప్పారు. స్టార్‌గా ఎదిగిన తర్వాత తన జీవనశైలిలో పెద్దగా మార్పు రాలేదని, ప్రస్తుతం మరింత బాధ్యతగా పని చేస్తున్నానని తెలిపారు. 'కేజీఎఫ్'లోని పవర్‌ఫుల్ డైలాగ్స్‌ను నిజ జీవితానికి అన్వయించుకోవాల్సిన అవసరం లేదని యశ్ స్పష్టం చేశారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రతికూలంగా కాకుండా సరైన ఆలోచనతో ఎదుర్కోవాలనేది తన నమ్మకమని చెప్పారు. ప్రస్తుతం 'టాక్సిక్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో కియారా అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# సాంప్రదాయ లుక్‌లో త్రిష కనువిందు



దక్షిణాది సినీ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటి త్రిష కృష్ణన్ మరోసారి తన అందం, సాంప్రదాయ శైలితో ఆకట్టుకున్నారు. పసుపు రంగు చీరలో ఆమె కనిపించిన తీరు ఎంతో క్లాసిక్‌గా, హుందాగా ఉంది. ఈ చీర తన తల్లికి చెందినదని త్రిష వెల్లడించారు. దీనికి లేత ఆకుపచ్చ రంగులో మెరిసే బ్లౌజ్‌ను జత చేయడంతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది.
సాంప్రదాయ ఆభరణాల్లో భాగంగా అందమైన జుంకా చెవిపోగులను ధరించిన త్రిష.. జుట్టును చక్కగా పైకి ముడివేసి, అందులో తెల్లని మల్లెపూలను అలంకరించుకున్నారు. మృదువైన లైటింగ్, ప్రశాంతమైన పోజ్‌తో తీసిన ఈ ఫొటోషూట్ ఆమె సహజమైన అందాన్ని మరింతగా చూపిస్తోంది. దక్షిణాది సంప్రదాయానికి ఆధునిక ఫ్యాషన్ టచ్ జోడించిన ఈ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.
ఈ ఫొటోషూట్‌కు సంబంధించిన స్టైలింగ్‌ను ఏకల ఖని, హర్షేన్ రవిచందర్ చేశారు. జుట్టు అలంకరణ, మేకప్, ఫొటోగ్రఫీ విభాగాల్లో ప్రత్యేక నిపుణులు పనిచేశారు. త్రిష స్వయంగా మేకప్ చేసుకోవడం కూడా ఈ లుక్‌లో మరో ప్రత్యేకతగా నిలిచింది. మొత్తం ఫొటోషూట్‌లో ఆమె వ్యక్తిత్వానికి తగ్గట్టుగా సింపుల్, ఎలిగెంట్ స్టైల్‌ను ఎంచుకున్నారు.

సినీ ప్రయాణం ఇలా..

1983 మే 4న చెన్నైలో జన్మించిన త్రిష కృష్ణన్ 1999లో మిస్ చెన్నై టైటిల్‌ను గెలుచుకుని తొలుత మోడలింగ్ రంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల వైపు అడుగుపెట్టిన ఆమె 'జోడి' చిత్రంలో సహాయ పాత్రతో వెండితెరకు పరిచయమయ్యారు. 2002లో విడుదలైన 'మౌనం పేసియాదే' చిత్రంతో కథానాయికగా మంచి గుర్తింపు సంపాదించారు.
ఆ తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలో వరుస విజయాలతో త్రిష స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. 'సామీ', 'గిల్లి' వంటి చిత్రాలు ఆమె కెరీర్‌కు మంచి బలాన్నిచ్చాయి. తెలుగులో 'వర్షం' సినిమాతో ఆమెకు భారీ క్రేజ్ వచ్చింది. ఈ చిత్రం విజయంతో తెలుగు ప్రేక్షకులకు కూడా త్రిష మరింత దగ్గరయ్యారు. దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ అగ్ర కథానాయికల్లో ఒకరిగా నిలిచారు.

**విభిన్న పాత్రలతో గుర్తింపు**

కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ త్రిష తన నటనా ప్రతిభను నిరూపించుకున్నారు. 'విన్నైతాండి వరువాయా', '96' వంటి చిత్రాల్లో ఆమె చేసిన పాత్రలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ముఖ్యంగా '96'లో జానకి పాత్ర ఆమె కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది.మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియిన్ సెల్వన్' రెండు భాగాల్లోనూ త్రిష కీలక పాత్రలో కనిపించారు. యువరాణి కుందవై పాత్రలో ఆమె చూపించిన హుందాతనం, నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే 'లియో' వంటి భారీ చిత్రాల్లోనూ నటించి తన స్టార్‌డమ్‌ను కొనసాగించారు. దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నప్పటికీ త్రిష ఇప్పటికీ అగ్ర కథానాయికగా రాణిస్తున్నారు.

**అవార్డులతో సత్కారం**

త్రిష తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలతో పాటు పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా అందుకున్నారు. ముఖ్యంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో ఆమె నటనకు గుర్తింపు లభించింది. వాణిజ్యపరమైన విజయాలతో పాటు నటిగా తన పరిధిని విస్తరించుకోవడంపై ఆమె ఎప్పటికప్పుడు దృష్టి పెట్టారు.

**తాజా సినిమాలతో బిజీగా..**

2025లో త్రిష పలు ఆసక్తికరమైన చిత్రాల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 'ఐడెంటిటీ', 'విడాముయార్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ', 'థగ్ లైఫ్' వంటి సినిమాల్లో ఆమె నటించారు. విభిన్న కథాంశాలు, ప్రముఖ నటీనటులతో కలిసి పని చేస్తూ తన కెరీర్‌ను మరింత వైవిధ్యంగా కొనసాగిస్తున్నారు.రాబోయే రోజుల్లో సూర్యతో కలిసి నటిస్తున్న 'కరుప్పు'తో పాటు 'విశ్వంభర' వంటి చిత్రాల్లోనూ త్రిష కనిపించనున్నారు. సుదీర్ఘ సినీ ప్రయాణం ఉన్నప్పటికీ కొత్త తరహా కథలు, పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించడం ఆమె ప్రత్యేకతగా చెప్పొచ్చు. అందం, అభినయం, హుందాతనం కలగలిపిన తనదైన శైలితో త్రిష దక్షిణాది సినిమా రంగంలో ఇప్పటికీ ప్రత్యేకమైన గుర్తింపును కొనసాగిస్తున్నారు.



# సంక్రాంతి బరిలో అనిల్ రావిపూడి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి.. ప్రస్తుతం తన తదుపరి సినిమాను శరవేగంగా తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న మేకర్స్.. షూటింగ్‌ను ఏమాత్రం ఆలస్యం చేయకుండా కొనసాగిస్తున్నట్లు సమాచారం.ఆదివారం, సెలవు రోజులు అనే తేడా లేకుండా వరుస షెడ్యూల్స్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సీజన్‌లో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ సినిమా లాంచ్ రోజునే ప్రకటించారు. దీంతో అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేసేందుకు యూనిట్ వేగంగా పనిచేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.షూటింగ్ వేగంగా సాగుతున్నప్పటికీ క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని సమాచారం. దర్శకుడు అనిల్ రావిపూడితో పాటు నిర్మాణ సంస్థ కూడా ప్రతి సన్నివేశాన్ని అత్యుత్తమంగా తెరకెక్కించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రొడక్షన్ క్వాలిటీ, విజువల్ స్కేల్‌పై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరించిన సన్నివేశాల అవుట్‌పుట్ అద్భుతంగా రావడంతో చిత్రబృందంలో మరింత ఉత్సాహం పెరిగినట్లు తెలుస్తోంది. సంక్రాంతి విడుదలకు ముందే షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి సీజన్ టాలీవుడ్‌కు కీలకమైన రిలీజ్ విండో కావడంతో 'వెంకీ-అనిల్ 5'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పండుగ వాతావరణానికి తగ్గట్టుగా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ క్రేజీ మల్టీస్టారర్‌లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ హీరోలుగా నటిస్తుండగా.. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా కనిపించనున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో సంక్రాంతి బరిలో మరో విజయాన్ని అందుకోవాలని అనిల్ రావిపూడి టీమ్ గట్టిగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com